



ఉదయగిరి దుర్గం

ప్రపంచాన్ని ఒకచోట చేర్చే సామర్థ్యం ఒక్క పర్యాటక ప్రాంతానికే ఉంది. ప్రస్తుత పరుగు ప్రపంచంలో ఎవరికీ క్షణం తీరిక ఉండటం లేదు. ఉద్యోగం, వ్యాపారం ఇతర పనుల్లో ఎవరికివారు బిజీబిజీగా ఉంటున్నారు. అలాంటి వారిలో చాలామంది వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో ఇంటిల్లిపాదితో గడిపేందుకే మక్కువ చూపుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు, పర్యాటక ప్రాంతాలకు వెళుతున్నారు. అయితే, జిల్లాలో పేరెన్నికగల పర్యాటక ప్రాంతాలు ఉన్నా అక్కడ కనీస వసతులు ఉండటం లేదు. గొంతు తడుపుకుందామన్నా మంచినీరు దొరకని పరిస్థితి నెలకొంది. పర్యాటకుల కోసం నిర్మించిన భవనాలు కూడా శిథిలస్థితికి చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు నివేదికలు సిద్ధమవుతున్నా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల స్థితిగతులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...



రమ్మని.. రావొద్దనీ..!

ఎన్నో సుందర వనాలు.. కానీ అందవిహీనాలు

జిల్లాలో పడకేసిన పర్యాటక అభివృద్ధి

కనీసం గుక్కెడు మంచినీరూ కరువే!

కార్యరూపం దాల్చని ప్రతిపాదనలెన్నో!

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం)/ ముత్తుకూరు : జిల్లాలో పర్యాటక అభివృద్ధి పడకేసింది. రోజులు.. నెలలు.. సంవత్సరాలు గడుస్తున్నా పాలకులు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదు. ఎన్నికల హామీలకు వేదికగా మారుతున్న తీర ప్రాంత పర్యాటక అభి వృద్ధి అమలులో వాస్తవ రూపం దాల్చడంలేదు. వాణిజ్య అవసరాలకు తగ్గట్టు వసతులు కల్పించి అభివృద్ధి చేయడంపై ప్రభుత్వాలు చూపిస్తున్న ఆసక్తి పర్యాటక అభివృద్ధి విషయంలో సన్నగిల్లుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా బ్రేకులు పడ్డాయి. ప్రధానంగా నెల్లూరులో పర్యాటక కేంద్రాలుగా బారాషహీద్ దర్గా, బోట్ క్లబ్, ఇరుకళల పరమేశ్వరి, తల్పగిరి రంగనాథస్వామి ఆల యాలతోపాటు పెన్నా వంతెన, నరసింహుల కొండలు ఉన్నాయి. నరసింహకొండ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.60 కోట్లు మం జూరు చేయగా, ఇరుకళల పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి తిరుమల శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.2.5 కోట్లు మంజూరయ్యాయి. కానీ ఇప్పటి వరకు అభివృద్ధి పునాది రాయి పడలేదు. ఇక రాపూరు మండలంలో ని పెంచలకోన క్షేత్రం అభివృద్ధికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ఇప్ప టికీ అమలుకు నోచుకోలేదు. ఇక్కడ నృసింహస్వామి ఆలయంతోపా టు ఎత్తయిన కొండలు, జలపాతాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఇలాంటి ప్రాంతంపై పాలకులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో జొన్నవాడ కామాక్షితాయి, వలేటివారిపాళెంలో మాలకొండ లక్ష్మీనృసింహ స్వామి, దుత్తలూరులో వెంగమాంబ తదితర ముఖ్యమైన క్షేత్రాలతోపాటు కసుమూరు, ఏఎస్‌పేటలలో ప్రసిద్ధ దర్గాలు ఉన్నాయి. ఉత్సవాల సమయంలోనే కాస్తోకూస్తో వసతులు కల్పిస్తు న్న అధికారులు మిగిలిన రోజుల్లో గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక నగరంలోని బారాషహీద్ గంధ మహోత్సవం, రొట్టెల పండుగకు లక్షలాది మంది భక్తజనం తరలివస్తుంది. ఇప్పటికే ఆ దర్గాలో దాదాపు రూ.30కోట్లతో అభివృద్ధి చేశారు. మరో రూ.5కోట్లతో ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. కూటమి ప్రభుత్వ మైనా పర్యా టక రం గ అభివృద్ధికి చర్యలు తీసుకోవా లని ప్రజలు కోరు తున్నారు.



జలాశయం దిగువన అలంకారప్రాయంగా మురగుదొడ్లు

● **కళావిహీనంగా 'సోమశిల'**

జిల్లా ప్రధాన నీటివనరు సోమశిల జలాశయం అందవిహీనంగా మారుతోంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో రూ.2.5 కోట్లతో దేవదాయ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పర్ణశాలలు, డార్మెంటరీ, ఆడిటోరియం, మురుగుదొడ్లు, నీటివసతి కల్పించారు. అయితే, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ భవనాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీసం పర్యాటకులకు మంచినీరు, మురుగుదొడ్లు కరువయ్యాయి. ఇక జలాశయం ఎర్త్‌డ్యాంపై గతంలో పచ్చిక, వివిధ రకాల అరుదైన మొక్కలు, పూలకుండీలలో మొక్కలతో సుందరంగా దర్శనమిచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. మొక్కలు ఎండిపోయి కుండీలన్నీ అందవిహీనంగా మారియ. అలాగే రెండేళ్ల క్రితం వరద పోటెత్తండంతో సోమేశ్వరాలయ గోపురం కుప్పకూలింది. వెంటనే ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

- అనంతసాగరం

ప్రతిపాదనల్లోనే 'దుర్గం' అభివృద్ధి

అలనాటి శిల్పకళా నైపుణ్యం తీపి గుర్తులు పంచే ఆలయాల ఆనవాళ్లు ఉదయగిరి సొంతం. ప్రకృతి శోభ కలిగిన ఉదయగిరి దుర్గంపై దట్టమైన అడవులు, కొండలు, జలపాతాలు, సెలయేళ్లు చూడముచ్చటగా ఉంటాయి. ఎందరో రాజులు, నవాబులు, బ్రిటీషు పరిపాలనకు ఘన చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గం పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణం. ప్రతిసారి ఎన్నికల సమయంలో నేతల మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. 1989లో తొలివిడత రూ.2.16 కోట్లు మంజూరవగా, మొదటి దశలో 40 లక్షలతో కొన్ని పనులు చేసి వదిలేశారు. 2010లో ఉదయగిరి ఆనకట్ట సమీపంలో రూ.10 లక్షలతో అతిథిగృహం, హోటళ్లకు నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు అధికారులతో కలిసి దుర్గాన్ని పరిశీలించారు. దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపారు. ఆ ప్రతిపాదనలు సైతం కాగితాలకే పరిమితమయ్యాయి. పర్యాటక కేంద్రంగా దుర్గాన్ని అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

- ఉదయగిరి రూరల్



అల్లూరు : నిరుపయోగంగా ఇస్కపల్లి ప్రభుత్వ రిసార్టులు

తల్లడిల్లుతున్న తీరం

సువిశాల తీర ప్రాంతం జిల్లా సొంతం. ఇందుకూరుపేట మండలం మైపాడు, టీపీగూడూరు మండలం కొత్తకోడూరు, ముత్తుకూరు మండలం కృష్ణపట్నం, కావలి రూరల్ మండలం తుమ్మలపెంట, గుడ్లూరు మండలంలో కర్లపాళెం, ఉలవపాడు మండలంలో రామాయపట్నం ప్రాంతాల్లో బీచ్‌లు ఉన్నాయి. కృష్ణపట్నం వద్ద ఉన్న లైట్‌హౌస్‌తోపాటు ఇస్కపల్లి, రామాయపట్నం వద్ద ఉన్న లైట్‌హౌస్‌ల కమనీయ ప్రకృతి దృశ్యాలను తిలకించవచ్చు. ఈ ప్రాంతాల్లో అభివృద్ధి కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పలుమార్లు ప్రతిపాదనలు పంపించారు. కానీ అమలులో చేతులెత్తేశారు. ఎలాంటి వసతులు లేకున్నా సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. బీచ్‌లను అభివృద్ధి చేస్తే పర్యాటక ఆదాయంతోపాటు స్థానికులకు ఉపాధి లభ్యమవుతుంది. అలాగే తీర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాలు ఉన్నా సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటాయి.

- తుమ్మలపెంటలో బీచ్ అభివృద్ధి పనులు గత ప్రభుత్వ హయాంలో నిలిపివేశారు.
- నిధులు మంజూరు కాకపోవడంతో అల్లూరు మండలం ఇసుకపల్లి తీరంలో రిసార్ట్స్ నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. సందర్శకుల బెంచీల చుట్టూ ముళ్ల చెట్లు పెరిగిపోయాయి.
- మైపాడు బీచ్ రహదారి నిర్మాణం శిలాఫలకాలకే అంకితమైంది.
- కృష్ణపట్నంలో సుందరమైన బీచ్ అభివృద్ధి ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.
- కొత్తకోడూరు రోడ్డు, బీచ్ అభివృద్ధి సంగతే మరిచిపోయారు.

- ముత్తుకూరు

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

వెంకటగిరిలో ఎటుచూసినా జనసందోహమే

పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు

వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 26: వెంకటగిరి పోలేరమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. జాతరలో భాగంగా గురువారం తెల్లవారుజామున అమ్మవారు భక్తుల దర్శనార్థం దేవస్థానం వద్ద వేపమండలతో పందిరి వేసి కొలువు తీర్చారు. అమ్మవారిని దర్శించు కొనేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి వేయికళ్ల దుత్తల్లో దీపాలు వెలిగించి నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై నడుస్తూ కొందరు.. నవధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించుకొని ఇంకొందరు మొక్కులు చెల్లించుకున్నారు. నగరి ఆభరణాలైన బంగారు శూలం, సరుడును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకుపోయి ఉంచారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును తెగనరికి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి.. పొలి అని అరుస్తూ చల్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను ఉంచి విరూపమహోత్సవం నిర్వహించారు. శివాలయం వద్దకు చేరుకోగా అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనంతరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపంలో అమ్మవారి ప్రతిమను విరూపం గావించారు. అమ్మవారికి రాజాలు సమర్పించిన ఆభణాలతోపాటు, స్వర్ణ కిరీటం అలంకరించారు. ఈ ఏడాది జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టి సారించారు.

● **తప్పెవరిది?**

ఘటోత్సవంలో పోలికుండలు, బలిదున్న పోతును వాహనంపై ఊరేగించడం.. రాజాల వంటశాలకు బలిదున్న పోతును తీసుకెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి జాతర ఊరేగింపులో, గురువారం అమ్మవారి విరూపోత్సవంలో సంప్రదాయం ప్రకారం రాజాల నగిరి నుంచి పంపే సప్పరం వినియోగించాలి. ఈ ఆచారానికీ గత పాలకులు చరమ గీతం పాడి.. రథానికి బదులు ట్రాక్టరును వినియోగించారు. దీనిని అప్పట్లో తప్పు పట్టిన ఎమ్మెల్యే కురుగొండ్ల అదే ఆనవాయితీని కొనసాగించడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. సప్పరంపై అమ్మవారిని ఊరేగిస్తే రోడ్డుకు రెండువైపులా ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కలిగే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. ఇలా.. జాతర ఆచార వ్యవహారాల్లో తప్పిదం పాలకులదా? పాలకవర్గానిదా? లేదా అధికారులదా? అన్న చర్చ సాగుతోంది.

● **పోలీసుల వైఫల్యం**

జాతర నిర్వహణలో పోలీసుల వైఫల్యం కనిపించింది. భారీ బందోబస్తు ఏర్పాటుచేసినా వారిని సమన్వయ పరుచుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ ఏడాది కూడా పోలీస్, అధికారుల బంధువులకు వీవీఐపీ దర్శనాలు పెచ్చుమీరడం వల్ల సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ దశలో ఎమ్మెల్యే కురుగొండ్ల జోక్యం చేసుకొని వీఐపీ దర్శనాలను కొంతసేపు నిలిపి వేయించారు. పోలీస్, అధికారుల సిఫారసు ఉన్న వారి వాహనాలను మాత్రం రాజమార్గంలో గుడి దగ్గర వరకు వెళ్లనివ్వడంతో కొన్నిచోట్ల ప్రజలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

ఏర్పాట్లు ఫెయిల్ : ఆనం

పోలీసుల నిర్లక్ష్యంతో పోలేరమ్మ జాతర ఫెయిల్ అయిందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. పోలేరమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున గురువారం ఆయన పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్న తాను పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని పోరాడామన్నారు. గతేడాది ప్రభుత్వం గుర్తింపునిచ్చినా నిధులను విడుదల చేయలేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అమ్మవారి జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపునిస్తూ రూ. 50 లక్షలు అందించిందన్నారు. ఈ జీవోను కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు అందించారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రులు కందుల సురేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



అమ్మవారి దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



బటన్ నొక్కి నీరు విడుదల చేస్తున్న మంత్రి ఆనం

'సోమశిల'లో పర్యాటకాభివృద్ధికి రూ.600 కోట్లతో ప్రణాళిక

● రాష్ట్ర మంత్రి ఆనం ● 'రాళ్లపాడు'కు నీరు విడుదల

అనంతసాగరం, సెప్టెంబరు 26 : సోమశిలను సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం సోమశిల డ్యాంలోని పవర్‌హౌస్‌లో గంగమ్మకు పూజలు చేసి ఉత్తర కాలువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ కాలువ పరిధిలో తాగునీటి అవసరాల కోసం రాళ్లపాడు రిజర్వాయర్‌కు నీరు సరఫరా చేశామని చెప్పారు. సోమశిల ప్రాజెక్టు పరిధిలో రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేసి పర్యాటక కేంద్రంగా అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే, జలాశయం బ్యాక్‌వాటర్‌లో బోటు షికారుకు కూడా రూపొందాయన్నారు. ఈ పనులకు త్వరలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో శంకుస్థాపన చేసేలా కసరత్తు చేస్తున్నామన్నారు. గత వరదలకు ధ్వంసమైన సోమేశ్వరాలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. భక్తుల అభిరుచికి తగ్గట్టుగా పనులు పూర్తి చేయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో మధులత, ఎస్ఈ వెంకటరమణారెడ్డి, డ్యాం ఈఈ దశరథరామిరెడ్డి, టీడీపీ నేతలు సునీత, సుజాతమ్మ, కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మోసపోయాం.. కాపాడండి!

చెల్లని చెక్కులతో రూ.2 కోట్లకు కుచ్చుటోపీ ● మంత్రి ఆనంకు వినతి

సంగం : ఆత్మకూరు నియోజకవర్గంలో పలువురు మాస్టర్ వీవర్స్‌కు గుర్తు తెలియని వ్యక్తులు చెల్లని చెక్కులు ఇచ్చి సుమారు రూ.2 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన విషయం ఆల స్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు బాధితులు బుధవారం ఆత్మకూరులో మంత్రి ఆనంకు వినతిపత్రం అందచేశారు. మూడు నెలల కిందట సంగం, చేజర్ల, ఏఎస్‌పేట మాస్టర్ వీవర్స్ వద్దకు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి రూ.2 కోట్ల మేర పట్టు వస్త్రాలు అడిగారు. నమ్మకం కలిగేందుకు చెక్కులతోపాటు ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చారు. మార్జిన్ బాగుండటంతో మా స్టర్ వీవర్స్ చెక్కులు తీసుకుని పట్టు చీరలు అందచేశారు. అయితే, ఆ చెక్కులను బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యాయి. వాళ్లిచ్చిన సెల్ నెంబర్లకు ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో తాము మోసపోయామని తెలుసుకుని మూడు మండలాల చేనేత మాస్టర్ వీవర్స్ మంత్రి ఆనంను కలిశారు. దీంతో స్పందించిన ఆయన విచారణ చేయాలని డీఎస్పీకి సూచించారు.

'ఇరిగేషన్'లో పలువురి బదిలీ

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : జలవనరుల శాఖలో పలువురిని బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కావలి ఈఈ, నెల్లూరు ఇన్‌చార్జి ఎస్ఈ కృష్ణమోహన్‌ను నరసరావుపేట లింగంగుంట్ల ఈఈగా బదిలీ చేసింది. అనంతపురంలో ఈఈగా పని చేస్తున్న దేశ్యనాయక్‌ను నెల్లూరు డ్రైనేజీ డివిజన్ ఈఈగాను, సోమశిల ప్రాజెక్టు రెండో డివిజన్ ఈఈ శ్రీనివాసరావును గూడూరు డివిజన్ ఈఈగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● **పలువురు డిప్యూటీ కలెక్టర్లు..**

డిప్యూటీ కలెక్టర్లను కూడా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు ఆర్డీవో మలోలను జీఏడీలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వు ల్లో పేర్కొనగా ఆ స్థానంలో ప్రొహిబిషనరీ డిప్యూటీ కలెక్టర్ నాగ సంతోష్ అనూషను నియమించింది. ఆత్మకూరు ఆర్డీవో మధులతను నరసరావుపేటకు, ఆ స్థానంలో ప్రొహిబిషనరీ డిప్యూటీ కలెక్టర్ భూమిరెడ్డి పావనిని నియమించారు. అలాగే కావలి ఆర్డీవో శీనానాయక్‌ను జీఏడీలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా, ఆ స్థానంలో డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణను నియమించింది. తెలుగుగంగ ప్రాజెక్టు రాపూరు యూనిట్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు బదిలీ అయ్యారు.

బల్క్ బుకింగ్ ఎప్పుడు?

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదంటే ఇదే..! ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రారంభించినా.. అధికారుల వైఖరితో ఇంకా ఇసుక కష్టాలు తీరడం లేదు. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ ప్రారంభమై వారం రోజులు గడిచింది. కానీ ఇంత వరకు బల్క్ బుకింగ్‌కు అవకాశమివ్వలేదు. ఇదిగో ఇస్తున్నాం.. అదిగో ఇస్తున్నాం.. అంటూ రోజులు గడిపేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలోని ఇబ్బందులను మాత్రం అధికారులు గుర్తించలేక పోతున్నారు. ఈ ప్రభావం ప్రభుత్వ పనులు, కంపెనీలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలపై తీవ్రంగా పడుతోంది. సగం మంది భవన నిర్మాణ కార్మికులు ఈ వర్కులపైనే ఆధారపడి ఉన్నారు. ఈ పనులకు ఇసుక దొరకకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో కూలీలకు పనులు దొరకడం లేదు. జిల్లాలోని మూడు యార్డుల్లో 50 వేల మెట్రిక్ టన్నులకుపైగా ఇసుక నిల్వ ఉంది. అలాగే, రోజుకు సరాసరి 4 వేల టన్నుల వరకూ ఇసుకను డీసిల్టేషన్ పద్ధతిలో బయటకు తీస్తున్నారు. ఇంత నిల్వలు ఉన్నప్పటికీ బల్క్ బుకింగ్‌కు అవకాశమిచ్చి ఇసుక డిమాండ్‌ను తగ్గించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

విక్రయాలు మొదలైనా ఇంకా తీరని ఇసుక కష్టాలు

ప్రభుత్వ పనులపై తీవ్ర ప్రభావం

కంపెనీలు, అపార్ట్‌మెంట్లకూ ఇసుక కొరత

నిల్వలున్నా నిర్ణయం తీసుకోని ఉన్నతాధికారులు

నెల్లూరు, సెప్టెం బరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఇసుకను బంగారంగా మార్చేయడంతో ఇసుక ఆధారిత రంగాలు కుప్పకూలాయి. భారీ ధరను పెట్టి ఇసుకను కొనుగోలు చేయాల్సి వచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టింది. ఇసు కను నదిలో నుంచి తీసుకురావడానికి అయ్యే ఖర్చులు మినహా ఒక్క రూపాయి ఆదాయం కూడా తీసుకోకుండా ప్రజలకు అందించాలని నిర్ణయించింది. కానీ గత ప్రభుత్వం పర్యావరణ అనుమతులు తీసుకోకపోవడంతో ఇప్పుడు ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరిపేందుకు వీల్లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఎలాగైనా ప్రజలకు ఇసుక కొరతను తీర్చాలని భావించిన ప్రభుత్వం డీసిల్టేషన్ పాయింట్లను తెరమీదకు తీసుకొచ్చింది. సంగం, నెల్లూరు బ్యారేజీల ఎగువన డీసిల్టేషన్ చేసి ప్రాజెక్టుల్లో నీటి నిల్వను పెంచడంతో పాటు అక్కడి నుంచి ఇసుకను తెచ్చి ప్రజలకు అందించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల మొదటి వారంలో ఈ ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటి వరకూ సంగం, సూరాయపాలెం, పోతిరెడ్డిపాలెం పాయింట్ల నుంచి దాదాపు 55 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను వెలికితీశారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఉచిత ఇసుక పాలసీ మొదలవగా ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. జిల్లాలో రోజుకు సరాసరి ఐదు వేల మెట్రిక్ టన్నుల వరకూ ఇసుక విని యోగం ఉంటుందని అధికారుల అంచనా. అయితే ఆన్‌లైన్ బుకింగ్ కొత్త కావడంతో కొంత నెమ్మదిగా బుకింగ్‌లు జరుగుతూ వస్తున్నాయి. ఇప్పటి వరకూ 252 ట్రిప్పుల ఇసుక బుకింగ్ జరిగినట్లు అధికారుల సమాచారం. ఒక్కో ట్రిప్పులో 20 టన్నుల ఇసుకను బుకింగ్ చేస్తున్నారు. ఆ లెక్కన సుమారు 5 వేల టన్నుల ఇసుక అమ్మకాలు ఇప్పటి వరకూ జరిగాయి. ప్రస్తుతం సంగం యార్డులో 24 వేల మెట్రిక్ టన్నులు, పోతిరెడ్డిపాలెం యార్డులో 15 వేల మెట్రిక్ టన్నులు, సూరాయపాలెం యార్డులో 16 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. సాధారణంగా రోజుకు ఐదు వేల మెట్రిక్ టన్నుల వినియోగం ఉంటే అందులో సగం బల్క్ బుకింగ్‌లే ఉంటాయి. అంటే ప్రభుత్వ వర్కులు, అపార్ట్‌మెంట్లు, కంపెనీల నిర్మాణాలు వంటి వాటికి ఎక్కువగా ఇసుక వినియోగం ఉంటుంది. కానీ ఇప్పుడు ఈ బల్క్ బుకింగ్ కింద ఇసుకను కొనుగోలు చేసేందుకు అవ కాశం ఇవ్వలేదు. కేవలం సొంత ఇంటి నిర్మాణాలకు మాత్రమే ఇసుక బుకింగ్ చేస్తున్నారు. మర్రిపాడు యార్డులో విక్రయాలు నెలన్నర క్రితమే ఆగిపోయా యి. అప్పటి నుంచి ఇసుక దొరకక ప్రభుత్వ వర్కు లు, అపార్ట్‌మెంట్లు, కంపెనీల నిర్మాణాలకు ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. ఆఖరుకు టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద తుది వర్కులకు కూడా ఇసుక కొరత ఏర్పడడంతో పనులు నిలిచిపోయి ఉన్నాయి. నవంబరు నుంచి జిల్లాలో వర్షాకాలం ప్రారంభమవుతుంది. అప్పటిలోపు వీలైనంత త్వరగా పనులు చేసుకోవాలని పెద్ద వర్కులకు చెందిన వారు భావిస్తుంటారు. కానీ ఇప్పు డు ఇసుక దొరకకపోవ డంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతా ధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని పలువురు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

త్వరలోనే అవకాశమిస్తారు

బల్క్ బుకింగ్‌కు త్వరలోనే అవకాశమిస్తారు. ప్రస్తుతం దానిపైనే ఉన్నతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ఇసుక బుకింగ్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే పరిష్కరిస్తున్నాం. ప్రస్తుతం మూడు యార్డుల్లో 50 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

- ఏ శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ

జాతీయ స్థాయి పోటీలో వైద్య విద్యార్థి ప్రతిభ

● రాజా రిషిధర్‌రెడ్డి వ్యాసం ఎంపిక ● రాష్ట్రస్థాయిలో స్కాలర్‌షిప్‌నకు నలుగురు...



ప్రతిభ చూపిన వైద్య విద్యార్థులతో వైద్యులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 26 : జాతీయ స్థాయిలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షలో నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిర్వహించిన ఈ పోటీలో నాన్ కమ్యూనికల్ డిసీజ్‌పై ఏసీఎస్‌ఆర్ కళాశాలకు చెందిన రెండవ సంవత్సరం విద్యార్థి చెరుకుపల్లి రాజా రిషిధర్‌రెడ్డి సమర్పించిన వ్యాసం ఉత్తమ వ్యాసంగా ఎంపికైంది. ఈ పోటీకి 8వేల మంది విద్యార్థులు వ్యాసాలు పంపగా 400 మంది అధ్యాపకులు ఆ వ్యాసాలను పరిశీలించి 89 ఉత్తమ వ్యాసాలను ఎంపిక చేశారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రతి ఏటా నిర్వహించే రిసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి నలుగురు వైద్య విద్యార్థులు ఎంపికయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థి వెంకటవర్ధన్, ధీరజ్, తేజస్వీ, ఆయుస్యా మెటల్‌లు సమర్పించిన పరిశోధనాత్మక వ్యాసాలు ఎంపికయ్యాయి. దీంతో ఆ విద్యార్థులను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్ అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సౌమ్య సుధ, డాక్టర్ శశికళ, డాక్టర్ అఫ్రీన్, డాక్టర్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పొదలకూరు, సెప్టెంబరు 26: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని సూరాయపాలెంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సంగంకు చెందిన బొప్పూరు ప్రసాద్(37) అనే రైతు సూరాయ పాలెం వద్ద పొలాలు కౌలుకు తీసుకుని చేపల గుంటలు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో పొలంలోని మోటార్ పనిచేయక పోవడంతో, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా ఉందా లేదా అని పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ హనీఫ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ప్రసాద్

తహసీల్దారు కార్యాలయం ఎదుట

రైతు ఆత్మహత్యాయత్నం

విడవలూరు, సెప్టెంబరు 26: తమ పూర్వీకులు వీలునామా కింద ఇచ్చిన భూమిని రీసర్వేలో రెవెన్యూ అధికారులు ఇతరులకు ఇవ్వటాన్ని జీర్ణించుకోలేని టీడీపీ సానుభూతిపరుడయిన ఓ రైతు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఈ సంఘటన విడవలూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు వివరాలు.. చౌకిచర్లకి చెందిన వాసిరెడ్డి ఆదిశేషారెడ్డి, వాసిరెడ్డి శ్రీనివాసులురెడ్డిల వద్ద ఆదే గ్రామానికి చెందిన మడియాల బలరామయ్య సర్వేనెంబరు 185-బీలోని 4.32 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. బలరామయ్య చనిపోయాక ఆ భూమిని భార్య కాంతమ్మ కొంతకాలం సాగుచేసింది. అనంతరం తన తమ్ముడైన నిక్కుదల లక్ష్మయ్యకు కౌలుకి ఇచ్చింది. కాగా 2022లో మనుమడు నిమ్మల నాగార్జునకు పొలం నీదేనని వీలునామా రాసి ఇచ్చింది. కాగా 1992లో నిక్కుదల లక్ష్మయ్య పొలాన్ని కైవసం చేసుకుకోవాలని తనతల్లి పెంచలమ్మకు 4.32 ఎకరాలు స్థిరాస్తి అయినట్లుగా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించాడు. ఆ భూమిని నిక్కుదల రమాదేవికి ఎకరా, మస్తానయ్యకి 2.32 ఎకరాలు, వీరాస్వామికి ఎకరా రాసి ఇచ్చాడు. విషయం తెలుసుకున్న నాగార్జున ఆర్డీవో కోర్టుని ఆశ్రయించాడు. అతనికి అనుకూలంగా తీర్పురా వటంతో కుటుంబ సభ్యులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. 2016 నుంచి కోర్టులో కేసు నడుస్తుంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో రెవెన్యూ అధికారులు చౌకిచర్లలో రీసర్వేని నిర్వహించారు. ఆ సర్వేలో నిక్కుదల రమాదేవి పేరు మీద ఎకరా భూమి ఉంటే, 4.62 ఎకరాల భూమి ఉన్నట్లు అడంగళ్లు, ఒన్‌బీలు ఇచ్చారు. విషయం తెలుసుకున్న నాగార్జున ఇటీవల తహసీల్దారు చంద్రశేఖర్‌ను సంప్రదించారు. ఆయన విచారణ జరుపుతామని అనటంతో ఇక తనకు న్యాయం జరగదన్న మనస్థాపంతో నాగార్జున ఒంటిపై పెట్రోలు పోసుకుని గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ఆయన్ను వారించారు. విషయం తెలుసు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నాగార్జునతో మాట్లాడారు. ఈ విషయంపై తహసీల్దారుని వివరణ కోరగా రీసర్వే సమయంలో తాను విధులు నిర్వర్తించలేదన్నారు. నిజంగా నాగార్జునకి అన్యాయం జరిగితే విచారించి న్యాయం చేస్తామన్నారు.



ఆత్మహత్యకు పాల్పడేందుకు యత్నిస్తున్న నాగార్జునను వారిస్తున్న గ్రామస్థులు

కోవూరులో భారీ చోరీ

● 25 సవర్ల బంగారం, రెండు కిలోల వెండి అపహరణ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాస రావు

కోవూరు, సెప్టెంబరు 26: స్థానిక శాంతి నగర్‌లోని ఉప్పలపాటి నాగిరెడ్డి ఇంటిలో బుధవారం అర్ధ రాత్రి దొంగలు 25 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి సామగ్రిని అపహరించుకు వెళ్లినట్లు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు, శాంతినగర్‌లో నివాసముంటున్న నాగిరెడ్డి తన భార్యతో కలిసి బుచ్చి మండలం రేబాలలోని తమ కుమార్తె ఇంటికి బుధవారం సాయంత్రం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంటి తలుపులు, బీరువా పగులగొట్టి, దాచుకున్న నగలు, వెండి సామగ్రిని దోచుకున్నారు. రేబాల నుంచి గురువారం తిరిగివచ్చిన నాగిరెడ్డి దంపతులు తలుపులు పగులగొట్టి ఉండటాన్ని చూసి పోలీసులు ఫిర్యాదు చేశారు. రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు, సీఐ సుధాకరరెడ్డి, ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రల్ని సేకరించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బ్రాయిలర్ లైవ్	136
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7286
వెండి కిలో ధర	రూ. 94,400
వెండి ఒక గ్రాము	రూ. 97.40

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 26 : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల ప్రాతిపదికన ఏడాదిపాటు భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ సీహెచ్ ఉషారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేజీబీవీల్లో పీజీటీలు 15, సీజీటీలు 6, పార్ట్‌టైమ్ టీచర్స్ 7, అకౌంటెంట్ 1 కలిపి మొత్తం 29 పోస్టులున్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ఏపీకేజీబీవీ డాట్ ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా రూ.250 దరఖాస్తు రుసుం చెల్లించి అక్టోబరు 10వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయో పరిమితి ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18-42 అని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి ఐదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగినులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు వర్తిస్తుందని తెలిపారు.

సోమశిలకు 19,032 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, సెప్టెంబరు 26: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 19,032 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 53.275 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టాకు 1000, కండలేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

● ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 26 : స్కానింగ్ కేంద్రాల్లో కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. నెల్లూరులోని పలు స్కానింగ్ కేంద్రాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ విజయమార్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. స్కానింగ్ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. ఎట్టి పరిస్థితిలోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదన్నారు. దీన్ని అతిక్రమిం చే వారిపై గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్పొరేషన్ సెక్రటరీగా శ్రీలక్ష్మి

● ఫజులుల్లా నాయుడుపేట కమిషనర్‌గా బదిలీ

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 26 : నెల్లూరు కార్పొరేషన్ సెక్రటరీగా ఎం శ్రీలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులిచ్చింది. నుడా కార్యాలయంలో సెక్రటరీగా పని చేస్తున్న ఆమెను నగర పాలక సంస్థకు బదిలీ చేసింది. ప్రస్తుతం సెక్రటరీగా ఉన్న ఫజులుల్లాను నాయుడుపేట మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ చేసింది. కాగా, కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న నాగేశ్వరరావును రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. కాగా, టీపీఆర్వోగా నియమితులైన డబ్బుగుంట బాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

● పెండింగ్‌లో హాస్టళ్ల డైట్ చార్జీలు

● నెలల తరబడి బకాయిలు

● వంటల తయారీకి వార్డెన్ల అవస్థలు

● విద్యార్థుల సంఖ్య ఎక్కువ చూపుతూ కొందరు చేతివాటం

అప్పులతో వడ్డన



నెల్లూరులోని బీసీ సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 26: సంక్షేమ వసతిగృహాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. వీటిల్లోని విద్యార్థులకు సరైన భోజన వసతులు కల్పించ లేనిస్థితి నెలకొంది. డైట్‌చార్జీలను ప్రభుత్వం సకాలంలో చెల్లించక పోవటంతో వార్డెన్లు అప్పులు చేసి భోజనాలు పెట్టలేకపోతున్నారు. పౌరసరఫరాల శాఖ నుంచి బియ్యం మాత్రమే హాస్టళ్లకు అందుతున్నాయి. కూరగాయలు, పండ్లు, పప్పుదినుసులు, పాలు, నూనె తదితరాలను బయట నుంచి వార్డెన్లు కొనుగోలు చేస్తున్నారు. వీటితో పాటు కోడిగుడ్లు, చికెన్ లను కూడా కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ ఏడాది జూన్‌లో హాస్టళ్లు ప్రారంభమైన నాటి నుంచి విద్యార్థులు చదువుకుంటు న్నారు. అప్పటి నుంచి హాస్టళ్లకు డైట్ చార్జీలు రాలేదు. దీంతో ప్రతినెలా అప్పులు చేసి వార్డెన్లు నిత్యావసర సరుకులను తీసుకుని వస్తున్నారు. ఇలా నెలల తరబడి అప్పులు చేయాలంటే, అప్పులిచ్చే వారు కూడా ఇవ్వటం లేదని కొంతమంది వార్డెన్లు వాపోయారు.

● **విద్యార్థుల సంఖ్య పెంచి చూపుతూ..**

కొందరు వార్డెన్లు హాస్టళ్లను సక్రమంగా నిర్వహిస్తుండగా, ఇంకొం దరు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. సక్రమంగా నిర్వహించే వార్డెన్లకు డైట్ బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. నామమాత్రంగా నిర్వహించే వారికి మాత్రం డైట్ బిల్లులు ఆలస్యంగా వచ్చినా పెద్దగా ఇబ్బందులు ఉండటంలేదు. జిల్లాలోని కొన్ని హాస్టళ్లలో విదార్థులు 10 మంది కూడా లేరు. ఇలాంటి హాస్టళ్ల ఎక్కువగా తీరప్రాంత గ్రామా ల్లో ఉన్నాయి. కానీ అక్కడ పనిచేసే వార్డెన్లు మాత్రం తమ హాస్టళ్లలో 50 మంది ఉన్నారని, మరికొందరు 75 మంది ఉన్నారంటూ రిజిస్టర్లలో పేర్లు రాసుకుని ప్రభుత్వ ధనాన్ని మింగేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ప్రస్తుతం ఏ హాస్టల్‌లోనూ 30 మంది విద్యార్థులకు మించి ఉం డటం లేదు. నిబంధనల ప్రకా రం ప్రతిరోజూ విద్యార్థుల చేత బయోమెట్రిక్ హాజరు వేయాల్సి ఉంది. కానీ ఈ విధానానికి కొందరు వార్డెన్లు స్వస్తిపలికి సాధారణ పట్టికల్లో హాజరు వేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంలో జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈ పరిస్థితి వల్ల కొందరు వార్డెన్ల అక్రమార్జనకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని హాస్టళ్లపై గతంలో ఏసీబీ అధికారుల దాడులు చేశారు. అయినా వార్డెన్లు నిర్భీతిగా తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ ప్రభుత్వ సొమ్మును స్వాహా చేస్తున్నారు.

● **మూడు నెలలుగా అందని చార్జీలు**

జిల్లాలో బీసీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు 120 ఉన్నాయి. వీటిలో బీసీ సంక్షేమ హాస్టళ్లు 63 ఉండగా, వీటిలో 3352 మంది బాలబాలికలు ఉన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు 57 ఉన్నాయి. వీటిలో బాలబాలికలు కలిపి 3875 మంది ఉన్నారు. వీటన్నింటికి డైట్ చార్జీలు మూడు నెలల నుంచి అందటం లేదు. డైట్‌చార్జీలు 3, 5 తరగతుల విద్యార్థులకు రూ.1,150, 6-10 తరగతుల విద్యార్థులకు రూ.1,400లను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ చార్జీల చెల్లింపు ఆలస్యమైతే వార్డెన్లు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. కొందరు వార్డెన్లు అక్రమ పద్ధతుల్లో సొమ్ముచేసుకుంటూ తమకేమీ కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అలాడే డైట్ చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

భూసేకరణ వేగం పెంచండి

● అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 26 : జిల్లాలోని ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, రైల్వేలైన్ల కోసం చేపట్టిన భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ శంకరన్ హాల్లో ఆయా ప్రాజెక్టులకు భూసేకరణపై సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. రైతుల నుంచి సేకరించిన భూములకు బిల్లులు చెల్లించాని సూచించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రతిపాదనలు వెంటనే కలెక్టరేట్‌కు పంపాలన్నారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ పూజ, నెల్లూరు ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో నేషనల్ హైవే అథారిటీ, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల పనుల ప్రగతిపై ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో శంకరన్ హాల్లో సమీక్ష జరిపారు. పనులు వేగంగా జరగటానికి తగిన యంత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. హైవే నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్ సేకరణకు అనుమతి ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుకను అందచేస్తామని, ఇసుక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూసేకరణ వల్ల నష్టపోతున్న వారికి త్వరగా చెల్లింపులు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, ఎన్‌హెచ్ పీడీ ఎంకే చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో సుస్థిరమైన అభివృద్ధి

● వీఎస్‌యూ వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు



విద్యార్థుల మధ్య కూర్చుని ఉన్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, సెప్టెంబరు 26 : విద్య జీవితంలో సుస్థిరమైన అభివృద్ధికి నాంది అని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. స్థానిక వీఎస్‌యూలో గురువారం స్టాటిస్టిక్స్, కామర్స్, ఇంటిగ్రేటెడ్, బయోటెక్నాలజీ విద్యార్థుల ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమకాలీన ప్రపంచంలో కొత్త అవకాశాలు, సవాళ్లను స్వీకరించి వాటిని అనుకూలంగా మార్చుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, కోర్సుల విభాగాధిపతులు జీ విజయనందకుమార్ బాబు, డాక్టర్ వీ చెంచురెడ్డి, డాక్టర్ మేరీ సందీప్, డాక్టర్ సాయినాథ్, శ్రీకన్యరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎడ్ ప్రాక్టికల్స్ సందర్శన

నెల్లూరు నగరంలోని వెంగళరావు నగర్ వద్ద ఉన్న మునిసిపల్ పాఠశాలలో జరుగుతున్న సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ బీఎడ్ ప్రాక్టికల్స్‌ను వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యాసన అనుభవాలను తెలుసుకున్నారు.

పార్వతమ్మకు కన్నీటి వీడ్కోలు

● భారీగా తరలివచ్చిన ప్రముఖులు, అభిమానులు ● ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

నెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మకు ప్రముఖులు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. పార్వతమ్మను కడసారి చూసేందుకు అనేక ప్రాంతాల నుంచి తరలివచ్చారు. పార్టీలకు అతీతంగా నాయకులు నెల్లూరులోని మాగుంట నివాసంలో ఉంచిన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్వతమ్మ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. పార్వతమ్మ సేవలకు గుర్తుగా కూటమి ప్రభుత్వం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. ప్రభుత్వం తరఫున మంత్రి గొట్టిపాటి రవికుమార్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు మాగుంట కుటుంబం చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు. కాగా గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు పార్వతమ్మ అంతిమయాత్ర ప్రారంభమైంది. అంతకుముందు పోలీసులు గౌరవ వందనం సమర్పించగా, పోలీసు బ్యాండుతో నివాళులర్పించారు. మాగుంట నివాసం నుంచి ప్రారంభమైన ఈ అంతిమయాత్రలో కుటుంబ సభ్యులతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు పాల్గొన్నారు. కేవీఆర్ జంక్షన్, ఎస్2 సినిమా హాల్, విజయమహల్ గేట్, గాంధీ బొమ్మ, కనకమహల్ సెంటర్, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా బోడిగోడితోట స్మశానం వరకు యాత్ర సాగింది. అక్కడ ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కారాలు జరిగాయి. పోలీసులు గౌరవ వందనం చేసి గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. మంత్రి గొట్టిపాటితో పాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్, దామచర్ల జనార్ధన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు పార్వతమ్మ పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరాం, నన్నపునేని రాజకుమారి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కంభంపాటి విజయరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, బీజేపీ నాయకులు పీ సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి, తదితరులు పార్వతమ్మకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



పార్వతమ్మ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



పార్వతమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న అభిమానులు

పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక కార్యాచరణ

● జీఎం మారుతీ ప్రసాద్



నెల్లూరు (వెంకటేశ్వరపురం): జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని జిల్లా పరిశ్రమలశాఖ జీఎం మారుతీ ప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం సాయంత్రం జీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేలా అందరూ కలసి పనిచేయాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి వరకు జీఎంగా పనిచేసిన సుధాకర్ కర్నూలుకు బదిలీ కావడంతో కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డీడీ షఫీ, ఏడీ శ్రీధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పాఠశాల అభివృద్ధి నిధుల గోల్‌మాల్

● రూ.ఐదు లక్షలు కూడా కాని పనులకు రూ. 11 లక్షలు ఖర్చట ● లెక్కలు అడిగిన గ్రామస్థులపై దాడి

కావలి రూరల్, సెప్టెంబరు26: మండలంలోని కొనదిన్నె ప్రాథమిక పాఠశాల అభివృద్ధి నిధులు గోల్‌మాల్‌పై గురువారం రచ్చ జరిగింది. నిధులు గోల్‌మాల్ అయ్యాయని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల అభివృద్ధికి పెట్టిన ఖర్చుకు బిల్లులు చూపాలని హెచ్‌ఎం రమణయ్యను, గత ప్రభుత్వంలో ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా పనిచేసిన కమలాపూరి శ్రీవిద్య, ఉప్పాల తిరుపతిరావులను గురువారం తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో ఆగ్రహించిన వారు ఖర్చులు మేము చూపం... ఏమిచేసుకుంటారో చేసుకోండి.. అంటూ ఎదురుదాడికి దిగారు.

కాగా పాఠశాల అభివృద్ధికి రూ. 25 లక్షలు మంజూరు కాగా, 2022లో హెచ్‌ఎం ఖాతాలోకి రూ.11 లక్షలు పడ్డాయి. హెచ్‌ఎంతోపాటు ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు సంతకాలు చేసి 2022 నుంచి 2023 వరకు వరకు విడతల వారీగా రూ.11 లక్షలు డ్రా చేశారు. ఆ నిధులతో పాఠశాల చుట్టూ ప్రహరీకి బేస్‌మెంట్, సెప్టిక్ ట్యాంక్, రెండు మరుగు దొడ్లు మాత్రమే కట్టి వదిలేశారు. అనంతరం టీడీపీ కూటమి అధికారం చేపట్టాక ఇటీవల స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా బలగాని చెన్నయ్య, కైదుపల్లి మమతను ఎన్నుకున్నారు. వీరు రూ.11 లక్షలకు లెక్కలు అడగటంతో ఆ నగదుకు పనులు చేశామని వారు బదులిచ్చారు. దీంతో రూ.5 లక్షలు కూడా ఖర్చు కాని పనులకు రూ.11 లక్షలు ఎలా అయ్యాయని బిల్లులు చూపమన్నారు. దీంతో గ్రామస్థులపై ఎదురుదాడికి దిగి అక్కడ నుంచి వెళ్లిపోయారని తల్లిదండ్రులు తెలిపారు.


పాఠశాల ఆవరణలో నిర్మించిన మరుగు దొడ్డి

ఫిర్యాదు అందితే విచారించి చర్యలు : ఎంఈవోలు

పాఠశాల అభివృద్ధి నిధుల విషయంలో అవకతవకలు జరిగినట్లు మా దృష్టికి రాలేదని ఎంఈవోలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈ విషయమై మాకు ఎలాంటి ఫిర్యాదు అందినా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

వంద రోజుల పాలన అమోఘం : మంత్రి దుర్గేష్

కావలిటౌన్, సెప్టెంబరు26: వంద రోజుల కూటమి పాలన అమోఘమని పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం వెంకటగిరి జాతరకు హాజరై తిరుగు ప్రయాణంలో తుమ్మలపెంట రోడ్డులోని జనసేన కార్యాలయానికి విచ్చేశారు. ఆయనకు జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే 8పండగలను రాష్ట్ర పండుగలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్‌జీవన్‌లో వైసీపీ డబ్బులు కాజేసిందన్నారు. ఇంకా వైసీపీ అవాకులు,చివాకులు పేలడం చూస్తుంటే వారికింకా బుద్ధి రాలేదన్నారు. కాగా బీజేపీ నేతలు కూడా మంత్రిని కలిసి సత్కరించారు.


మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న జనసేన ఇన్‌చార్జి సుధాకర్

వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు ఆర్థిక సాయం

కావలిటౌన్, సెప్టెంబరు26: స్థానిక వైకుంఠపురంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు పూర్వ విద్యార్థి శ్రీమల్లి రాము రూ.20వేలు గురువారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ మేఘమాల, సభ్యులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు తదితరులు రామును అభినందించారు.

కావలిలో తాగునీటి సమస్య తలెత్తకూడదు

● మున్సిపల్ కమిషనర్

కావలి,సెప్టెంబరు26: పట్టణంలో మంచినీటి సమస్య ఉందని ప్రజలు ఫోన్లు కానీ, కార్యాలయానికి కానీ వచ్చి అడక్కముందే, ఆ సమస్యను సచివాలయాల పరిధిలోనే పరిష్కరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్యపై ఇంజనీరింగ్ అధికారులు, వాటర్‌వర్క్స్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో గురువారం కమిషనర్ చాంబర్‌లో కమిషనర్, డీఈ సాయిరాంలు సమీక్షించారు. విద్యుత్ మోటార్లు, పైపులైన్లు రిపేర్లు వచ్చినా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి తాగు నీరు అందేట్లుగా చూడాలన్నారు.

ఉదయగిరి ప్రజల సాగునీటి కష్టాలు తొలగిస్తా : కాకర్ల

కలిగిరి, సెప్టెంబరు 26: ఉదయగిరి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న, సాగు, తాగునీటి కష్టాలను తొలగించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని క్రాకుటూరులో గురువారం ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ వందరోజుల పాలనపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచి గోగుల మంజుల, ఎంపీటీసీ హరిశ్చంద్రారెడ్డి, గంజాం రాఘవేంద్ర, బీవీ రామారావు, మలినేని శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.


క్రాకుటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● తిరుమల పవిత్రతను మంట కలిపిన జగన్

కందుకూరు, సెప్టెంబరు 26 : తిరుమల ఆలయ పవిత్రతను జగన్ మంట కలిపారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని విక్కిరాలపేట రోడ్డులో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఇక్బాల్, సీఐ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసులు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సంగం : వెంగారెడ్డిపాళెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి తదితరులు

● వెంగారెడ్డిపాళెంలో..

సంగం, సెప్టెంబరు 26: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెయింట్ ముద్దలు ప్రమాదమే కదా ?

రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన వ్యానులో నుంచి జాతీయ రహదారిపై పడిన పెయింట్‌తో ప్రమాదం పొంచి ఉంది. మద్దూరుపాడు జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇటీవల ఓ వ్యాను ప్రమాదానికి గురైంది. ఆ వాహనంలో నుంచి రంగుడబ్బాలు పడి రంగులు మొత్తం రోడ్డు పాలయ్యాయి. అవి చెక్కులు కట్టి ముద్దలు ముద్దలుగా ఉన్నాయి.దీంతో వర్షాలు పడినప్పుడు వాహనాలు రోడ్డుపై జారి ప్రమాదానికి గురయ్యే ప్రమాదముందని వాహనచోదకులు అంటున్నారు. ప్రమాదాలు జరగ్గముందే హైవే సిబ్బంది వీటిని తొలగించాల్సి ఉంది.

- కావలి రూరల్



వరద బాధితులకు ఒకరోజు వేతనం విరాళం

కందుకూరు, సెప్టెంబరు 26 : విజయవాడ వరద బాధితులకు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ఒకరోజు వేతనం రూ.1,10,987లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి గురువారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పీ రాజగోపాల్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా, షేక్ షనాజ్ బేగం, లైబ్రేరియన్ గడ్డం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఇంటూరికి చెక్కు అందచేస్తున్న టీఆర్ఆర్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డాక్టర్ నూకసానికి సన్మానం

లింగసముద్రం, సెప్టెంబరు 26 : ఏపీ టూరిజం కార్పోరేషన్ చైర్మెన్‌గా నియమితులైన డాక్టర్ నూకసాని బాలాజీని మండలంలోని పెదపవని టీడీపీ నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడూరి కల్పన, టీడీపీ నాయకులు ధనుం మధు, కూరపాటి విజయభాస్కర్, నారిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల అందజేత

లింగసముద్రం, సెప్టెంబరు 26 : స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన బెడ్‌షీట్లను గురువారం పంపిణీ చేశారు. హాస్టల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేఆర్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం. యు మాధవరావు వాటిని విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఎం శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక

ఉలవపాడు, సెప్టెంబరు 26 : జూనియర్స్ బాలబాలికల షూటింగ్ బాల్ ఎంపికలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ మురళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు వయసు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. మరింత సమాచారం కోసం 89190 36160 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

వేములపాటి ఎంపికపై హర్షం

కొండాపురం : ఏపీ టిడ్కో చైర్మన్‌గా ఉదయగిరి నియోజకవర్గ వాసి, జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేము లపాటి అజయ్ కుమార్ ఎంపికపై గురువారం ఆపార్టీ మండల ఉపా ధ్యక్షుడు కె.రాఘవేంద్ర, భీమవరప్పాడు జనసేన అధ్యక్షుడు తిప్పినేని రమేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. అజయ్‌కుమార్ భవిష్యత్తులో మరె న్నో పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు.

జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్

వింజమూరు : మండలంలోని చాకలికొండ రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పదో తరగతి నుంచి చెనికల షాహిద్, 9వ తరగతి నుంచి గుండ్లపల్లి లోకేష్, 8వ తర గతి నుంచి కుంచెం లాస్య ప్రతిభను చాటి ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

స్వర్ణాంధ్ర 2047పై అవగాహన

ఏఎస్ పేట, : స్థానిక ఎంపీడీవో కార్యలయంలో గురువారం అధికారులకు స్వర్ణాంధ్ర-2047పై అవగాహన కార్యక్రమం ఎంపీ డీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలను భాగస్వామ్యం చేసి రూపొందించవలసిన ప్రణాళికల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఓ రాజేంద్ర, స్పెషల్ ఆఫీసర్లు జ్యోతి, సాయి, ప్రసాద్, సతీష్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

ఆత్మకూరు : విద్యార్థి జీవితంలో సమయం చాలా విలువైనదని ఉర్దూ జిల్లా డిఐ షేక్ ఖాజామోహిద్దీన్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని అశ్వీనీపురంలో ఉన్న ఉర్దూ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాషా, ఉపాధ్యాయుడు అబ్దుల్ హఫీజ్ పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉర్దూ జిల్లా డీఐ షేక్ ఖాజామోహిద్దీన్

అనంతసాగరం పీహెచ్‌సీ తనిఖీ

అనంతసాగరం, సెప్టెంబరు 26: స్థానిక పీహెచ్‌సీని గురువారం జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలి తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో వ్యాధి నివారణ చర్యలపై పలు సూచనలు చేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై ఆరాతీశారు. అలాగే రేవూరు, పాతదేవరవాయపల్లి ఆరోగ్య ఉపకేంద్రాలను పరిశీలించారు


వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా అధికారి ఖాదర్‌వలి

నేటి నుంచి గంధ మహోత్సవం

అనంతసాగరం, సెప్టెంబరు 26: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని హజరత్ మహ్మూర్ అలిషాఖాదరీ దర్గా 14వ గంధమహోత్సవం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు సాని సాహెబ్, మజీద్ సాహెబ్ తెలిపారు. ఈసందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు వసతి, అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 26: జమాతే ఇస్లామి హింద్ ఉదయగిరి శాఖా మహిళా విభాగం ఆధ్వర్యంలో స్వేచ్ఛ పేరుతో మోసపోవద్దు అనే అంశంపై ఇటీవల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్యుడు అఖిల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు అసియా, నిర్వాహకురాలు అల్సానియా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం స్థాపించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 26: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ నరసింహులు సూచించారు. గురువారం ఫడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డ సంచులు వాడాలని సూచించారు. కళాశాల ఆవరణలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫడ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య, బీజేపీ నాయకులు ఆవుల రోశయ్య , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కల్లూరి మోహన్‌రెడ్డి గురువారం రూ.10 వేలు విలువ కలిగిన మైక్‌సెట్‌ను ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోడబండ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయిని ప్రశాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పఠన, బోధనా సామర్థ్యాలను పెంపొందించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 26: విద్యార్థుల పఠనా, బోధనా సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. గురువారం మండలంలోని కృష్ణంపల్లి మెయిన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆర్లపడియ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరామిరెడ్డి, పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ వాగ్దానాలను నేరవేర్చడమే లక్ష్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 26: మండలంలోని చెర్లోయడవల్లిలో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.వారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలు, స్టిక్కర్లు అందజేశారు. అనం తరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ వాగ్దానాలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, సర్పంచి చేరెడ్డి ప్రభావతమ్మ, రావులకొల్లు మాజీ సర్పంచి ఆర్ మోహన్‌రెడ్డి తదితరులుఉ పాల్గొన్నారు.

'నూకసాని' ఎంపికపై హర్షం

లింగసముద్రం, సెప్టెంబరు 26 : ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మెన్‌గా ఎంపిక కావడంపై పలువురు గురువారం హర్షం వ్యక్తం చేశారు. మండల నాయకులు బోడి సురేష్, చిట్టిబోయిన సురేష్, జాజుల మనోజ్, బొచ్చు మాల్యాద్రి, దాసరి దేవేంద్ర, దిడ్డి వెంగబాబు తదితరులు ఒంగోలులోని కార్యాలయంలో బాలాజీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

జలదంకి, సెప్టెంబరు 26: మండలంలోని జమ్మలపాలెం ఎస్సీకాలనీకి చెందిన మైనంపాటి వినోద్‌కుమార్ ఇల్లు ఇటీవల దగ్ధమైంది. దీంతో జలదంకి రెడ్‌క్రాస్ చైర్మన్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా పాలక మండలి సభ్యుడు డీ రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డిలు గురువారం బాధిత కుటుంబానికి వస్తుసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.3వేలు అందజేశారు. అనంతరం రెడ్‌క్రాస్ బృందం స్థానిక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

29న మెగా వైద్య శిబిరం

అల్లూరు, సెప్టెంబరు 26 : మండలంలోని ఇందుపూరు కాలువ సమీపంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 29న మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు అడ్మిన్ మేనేజరు అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ట్రస్ట్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఎస్ఆర్ ట్రస్ట్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజరు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మను దర్శించుకున్న ప్రముఖులు

వింజమూరు, సెప్టెంబరు 26 : వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరలో గురువారం పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కాకర్ల వెంకట్, మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, మాలేపాటి చైతన్యలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఝలాల ఉత్సవం

ఏఎస్‌పేట, సెప్టెంబరు 26: స్థానిక హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధ మహోత్సవంలో భాగంగా గురువారం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఘనంగా ఝలాల ఉత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ ఝలాలను ప్రత్యేకంగా తయారుచేసి దర్గాపై ఉన్న చంద్రవంకకు అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు తీసుకొచ్చిన ఝలాలను చంద్రవంకతో పాటు దర్గాకు అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదులు పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

మాగుంట పార్వతమ్మ మృతి తీరనిలోటు

కావలిటౌన్, సెప్టెంబరు26: మాగుంట పార్వతమ్మ మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ముసునూరులోని ఆయన నివాసం వద్ద పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ట్రంకురోడ్డు అభివృద్ధి పార్వతమ్మ పుణ్యమేనని, ట్రంకురోడ్డుకు పార్వతమ్మ రోడ్డుగా నామకరణం చేస్తే స్వాగతిస్తామన్నారు. కాగా గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న పాత్రికేయుడు శ్రావణ్‌ను ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు మంచిది కాదన్నారు.


విలేకరులతో ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలిలో దేవర సంబరాలు

కావలి రూరల్ : పట్టణంలో శుక్రవారం విడుదల కానున్న దేవర సినిమా సందడి నెలకొంది. స్థానిక మానస థియేటర్ వద్దఏర్పాటు చేసిన బాబాయ్ నందమూరి బాలక్రిష్ణ, అబ్బాయ్ ఎన్టీఆర్ కటౌట్లు ఆకర్షణగా నిలిచాయి. పట్టణంలోని 4 థియేటర్లలో ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్, కౌంటర్ల వద్ద టికెట్లు అందుబాటులోకి తెచ్చారు. రాత్రికి ఫ్యాన్సీషో వేయనున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ఎక్సైజ్ అధికారుల బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 26 : ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా డీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్‌గా దయాసాగర్, జిల్లా అధికారిగా ఏ శ్రీనివాసులు నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వారికి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంలోని ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా షేక్ అయిషా బేగంను నియమిస్తూ ఏపీఎస్‌డీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న బీ జగదీశ్వర్ రెడ్డిని ఏపీఎస్ ఫోర్స్‌మెంట్ ఎస్‌ఈగా, జీ రమేష్‌ను ఏఈఎస్‌గా నియమించారు.

గంజాయి అక్రమ రవాణాలో ఇద్దరి అరెస్టు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 26 : గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకుల ను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే పోలీసుస్టేషన్‌లో నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు నిందితుల వివరాలు మీడియాకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన లెనిన్, అమయప్పన్ కొంత కాలంగా ఒడిశా, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి వారి ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే గురువారం నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న లెనిన్, అమయప్పన్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అందులో ఉన్న ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.

వామ్మో.. శునకాలు!

● ఆరునెలల్లో 37మందికిపైగా క్షతగాత్రులు



కొడవలూరు : మండలంలో రోజురోజుకు వీధి కుక్కల సంఖ్య పెరుగుతోంది. ఏ గ్రామంలో చూసినా గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాదచారులు, వాహనదారుల వెంటపడి దాడి చేస్తున్నాయి. గత ఆరు నెలల కాలంలో 37మందికి పైగా కుక్కల దాడిలో గాయపడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో ఆర్థం చేసుకోవచ్చు. దీంతో పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలంటే తల్లి దండ్రులు భయాందోళనకు గురవుతు న్నారు. రాత్రిళ్లు ద్విచక్ర వాహనదారులకు అవి వెంబడి స్తున్నాయి. మనుషులతో పాటు పశువులను కూడా వీధికుక్కలు వదలట్లేదు. ఆగస్టులో కొత్తవంగల్లు,పెయ్యలపాళెం, రేగడిచెలిక గ్రామాల్లో సుమారు 20పైగా గొర్రెలు, కోళ్లపై దాడి చేసి చంపేశాయి. మండలంలో నార్తురాజుపాళెం, కొడవలూరు, రామన్నపాళెం, కమ్మపాళెం, రేగడి చెలిక గ్రామాల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాగా కుక్కల సంఖ్యను నియంత్రిం చాల్సిన అధికారులు వాటి గురించి పట్టించుకోవడంలేదు. నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శి గ్రామంలో శునకా లను గుర్తించి, వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయిం చాలి. రాబిస్ వ్యాధి సోకకుండా టీకా వేయించాలి. కానీ వారు అవేమీ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కుక్కల బెడద నుంచి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్థల వివాదంలో ఒకరిపై దాడి

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 26 : స్థల వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై సంతపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... సంతపేటకు చెందిన సుబ్బారావు, దినేష్ వరుసకు బాబాయ్, అబ్బాయ్‌లు. వారి మధ్య స్థల వివాదం నేపథ్యంలో గురువారం సుబ్బారావుపై దినేష్ దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, వికలాంగులు, నిరక్షరాస్యులకు ప్రభుత్వ ఉచిత న్యాయ సహాయం అంది స్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవా లని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే వాణి తెలిపారు. గురువారం నెల్లూరు హెడ్ పోస్టాఫీసులో న్యాయ సేవా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తుల మధ్య వచ్చే తగాదాలకు సంబం ధించిన కేసులను న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ అనీల్‌బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చీపురు పట్టి శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

● గొలగమూడిలో చీపురు పట్టి వీధులు శుభ్రం చేసిన సోమిరెడ్డి

వెంకటాచలం, సెప్టెంబరు 26: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గొలగమూడిలో గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలోని వీధులను చీపురు పట్టి విద్యార్థులు, గ్రామస్థులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. తొలుత విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే సర్వేపల్లి నియోజకవర్గంలోనూ పచ్చదనం - పరిశుభ్రత కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మితరెడ్డి, ఎంపీడీవో ముజీబున్నీసా, గొలగమూడి ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం, ఎన్డీఏ కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

ముత్తుకూరు, సెప్టెంబరు 26: తమ గ్రామంలో సమస్యలను పరిష్కరించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిత్రపటానికి చలివేంద్ర గిరిజన కాలనీవాసులు బుధవారం సాయంత్రం పాలాభిషేకం చేశారు. గిరిజన కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు, తాగునీటి వసతి, వీధి కుళాయిలకు మరమ్మతులు చేయించారని హర్షం వ్యక్తం చేశారు. కాలనీవాసులు ఎమ్మెల్యే సోమిరెడ్డితో పాటు సర్పంచ్ బూదూరు లక్ష్మీ, స్థానిక టీడీపీ నాయకులు పొట్టేళ్ల నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పుట్టినరోజు

● సేవా కార్యక్రమాలతో శ్రేణుల సంబరాలు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 26 : నెల్లూరు రూరల్ శాసన సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఇందులో భాగంగా 2వ డివిజన్ కార్పొరేటర్ పడిగినేటి రామ్మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో గుడిపల్లిపాడు కూడలి ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేశారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేతులమీదుగా పేదలకు వస్త్ర, అన్నదానం చేశారు. గుడిపల్లిపాడులో టీడీపీ నాయకుడు మేకల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. గిరిధర్‌రెడ్డి పాల్గొని రక్తదాతలను అభినందించారు. 19వ డివిజన్ రామలింగాపురం సెంటర్‌లో టీడీపీ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. దీనిని గిరిధర్‌రెడ్డి ప్రారంభించి కేక్ కట్ చేశారు. అల్లీపురానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య ఆధ్వర్యంలో నరుకూరు సెంటర్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏసీనగర్‌లోని గీతామయి బాలభవన్‌లో పిల్లలకు భోజనం, పండ్లు అందచేశారు. పిల్లలతో కేక్‌కట్ చేయించి, ఆశ్రమానికి గ్యాస్ స్టౌ బహూకరించారు. బారా షహీద్‌దర్గాలో ముస్లిం మైనార్టీ నాయకులు ప్రత్యేక దువా నిర్వహించారు. ఆమంచర్ల గ్రామం సేవాజ్యోతికాలనీలో టీడీపీ నాయకుడు మలినేని వేణునాయుడు ఆధ్వర్యంలో అన్నదానం, వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వాత్సల్య అనాథాశ్రమంలో స్థానిక టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, మనుబోలు రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బండి శ్రీకుమార్‌రెడ్డి, చెన్నారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పోలూరు సురేంద్ర, వెంకటేశ్వర్లు, పాండు పాల్గొన్నారు.

బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మించండి

నగరంలోని సుందరయ్య కాలనీ ప్రాంతంలో జాతీయ రహదారి కూడలిలో ప్రమాదాల నివారణకు బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మించాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి జాతీయ రహదారుల పీడీ ఏంకే చౌదరిని కోరారు. ఈ మేరకు పీడీ కార్యాలయంలో చౌదరికి వినతి పత్రం అందించారు. సుందరయ్యకాలనీలో సర్వీసురోడ్డును కూడా పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 25వ డివి జన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి పాల్గొన్నారు. అనంతరం 19వ డివిజన్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు.



2వ డివిజన్ ఎన్టీఆర్ కూడలి వద్ద కార్పొరేటర్‌కు కేక్ తినిపిస్తున్న గిరిధర్‌రెడ్డి



గుడిపల్లిపాడులోని రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కోటంరెడ్డి

డిక్లరేషన్‌లో సంతకం చేస్తానని జగన్ ప్రకటించాలి : ఉచ్చి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 26 : అలిపిరి మెట్లు ఎక్కేముందే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలలో డిక్లరేషన్‌పై సంతకం చేస్తానని బహిరంగ ప్రకటన చేయాలని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, సింహపురి ధార్మిక సంస్థ అధ్యక్షుడు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు జగన్ ప్రకటించకుంటే సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో అలిపిరి వద్దే అయనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి తిరుమల సంప్రదాయాలను పాటించలేదని విమర్శించారు. శ్రీవారి ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి వాడటం మహా అపరాధమని తెలిపారు. వేంకటేశ్వరస్వామిపై విశ్వాసం ఉంటే ఏ మతం వారైనా శ్రీవారిని దర్శించుకోవచ్చ న్నారు. అయితే అన్య మతస్తులు ఎంతటివారైనా స్వామి వారి దేవస్థానం డిక్లరేషన్ పుస్తకంలో సంతకాలు చేసి దేవదేవుని దర్శించుకుంటారన్నారు. కానీ, క్రైస్తవ మతాన్ని అనుసరించే జగన్‌మోహన్‌రెడ్డి గతంలో తిరుమల డిక్లరేషన్ పుస్తకంలో సంతకం చేయలేదని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పోటీ పూజలు చేయాలని చెప్పడం ప్రజలను రెచ్చగొట్టడమేనన్నారు.

స్వర్ణాంధ్ర -2047పై అవగాహన

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 26 : సౌత్ ఆములూరు మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వర్ణాంధ్ర-2047పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అహ్మద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం తదితర అంశాలపై దృష్టి సారించిందని వివరించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కె సునీజ క్యూఆర్ కోడ్ స్కాన్ గురించి వివరించారు. రాబోవు ఐదు సంవత్సరాలలో విద్యా రంగంలో తీసుకురావలసిన సంస్కరణలు అనే అంశంపై విద్యార్థులకు ఈనెల 27, 28, 29 తేదీలలో పాఠశాల, మండల, జిల్లా స్థాయిలలో వ్యాసరచన, వక్తృత్వం, డిబేటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె వసంతలక్ష్మీ, బి కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

రూరల్ పోలీసు స్టేషన్‌లో రాజకీయ రచ్చ

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 26 : నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో గురువారం నగరానికి చెందిన టీడీపీ నేత ధర్మవరం సుబ్బారావు, పోలీసుల మధ్య వివాదం నెలకొంది. ఓ కేసు విషయమై తాను పోలీసు స్టేషన్‌కు వెళ్లగా అక్కడ సీఐ, సిబ్బంది తనతో దురుసుగా ప్రవర్తించారని, వీడియో తీస్తుండగా బయటకు నెట్టేసి, గాయపరిచారని సుబ్బారావు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈ ఘటనపై సీఐ జీ వేణును వివరణ కోరగా సుబ్బారావుతో తానుగానీ, సిబ్బందిగానీ ఎవరూ దురుసుగా ప్రవర్తించలేదని తెలిపారు. స్టేషన్‌లో సీసీ కెమెరాలున్నాయని పరిశీలించవచ్చన్నారు. ఈ ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో చర్చనీయాంశమైంది. కాగా, ఈ విషయంలో రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.

నేడు సుధాకర్ ప్రసాద్ విగ్రహావిష్కరణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 26 : రెవెన్యూ అసోసియేషన్ దివంగత నేత తోట సుధాకర్ ప్రసాద్ కాంస్య విగ్రహావిష్కరణ శుక్రవారం జరగనుంది. సుధాకర్ ప్రసాద్ 23వ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని బీవీ నగర్‌లో రెవెన్యూ భవన్‌కు కేటాయించిన స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహావిష్కరణకు ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరుకానున్నారు. విగ్రహావిష్కరణను సుధాకర్ ప్రసాద్ సతీమణి కామాక్షిప్రసాద్, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా జరిపిస్తున్నా మని ఏపీఆర్‌ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి డానియల్ పీటర్‌రావు తెలిపారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 26 : తెలంగాణ ప్రభుత్వం ఎరుకల కులస్తుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, అదే రీతిలో ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎరుకలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శివ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎరుకలను సమాజంలో చులకనగా చూస్తూ హేళన చేస్తున్నారని తెలిపారు. తమ ఎరుకల కులానికి గొప్ప చరిత్ర ఉందని చెప్పారు. ఆధునిక వైద్యం అందుబాటులోకి రానిరోజుల్లో నాటు మందులు, వైద్య సలహాలు, చికిత్సలు అందించింది ఎరుకల వారేనని గుర్తు చేశారు. ఈ కార్య క్రమంలో కట్ట రమణయ్య, కట్టా రామా రావు, బండి బుజ్జయ్య, నల్గొండ వెంక య్య, కట్టా రమేష్, కంపాస్ శ్యామ్, కట్టా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా కనిగిరి రిజర్వాయర్ భూములు



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం ఇస్తున్న వేమిరెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు26: కనిగిరి రిజర్వాయర్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఈ మేరకు పర్యాటకశాఖామంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందచేశారు. వెంకటగిరిలోని తెలుగుగంగ అతిథిగృహంలో గురువారం మంత్రిని, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కోవూరు నియోజకవర్గంలోని పలు చారిత్రక ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ఆమె కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పరిశీలించి, అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

● పర్యాటకాభివృద్ధికి వనరులన్నీ వాడుకుంటాం

నెల్లూరు రూరల్ : సర్వేపల్లి నియోజకవర్గంలో పర్యాటకాభివృద్ధికి అందుబాటులో ఉండే వనరులన్నిటినీ వాడుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి నివాసంలో అల్పాహార విందుకు మంత్రి హాజర య్యారు. ఈ సందర్భంగా సర్వేపల్లిలో పర్యాటక పరంగా అందుబాటులో ఉండే వనరులను సోమిరెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కోడూరులోని వేళాంగిణి చర్చిని అభివృద్ధి చేస్తామన్నారు. కోడూరుబీచ్, వెంకటాచలంలోని నగరవనం ప్రాంతాలను చూడముచ్చటగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

● మంత్రి దుర్గేష్‌కు సన్మానం

విడవలూరు : రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్‌ని ఊటుకూరుకి చెందిన టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి గురువారం కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుకూరు పల్లిపాళెం సమీపంలో ఉన్న ఐల్యాండ్‌ని పర్యటక కేంద్రంగా అభివృద్ధి పరచాలన్నారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ కోవూరు నియోజకవర్గాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

● పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘం

కోవూరు : పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అమోఘమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీపీవో సుస్మితారెడ్డి, ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, ఎంపీడీవో శ్రీహరి, సర్పంచు యాకసిరి విజయ, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, జెట్టి రాజగోపాలరెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, జమీర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెల్లూరు (క్రైం) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు... చిల్లకూరు మండలం గుమ్మలదిబ్బకు చెందిన ఏడుకొండలు, పావని (41) దంపతులు ఈనెల 23న ఇస్కపల్లిలో బంధువుల ఇంట జరిగిన శుభకార్యంలో పాల్గొనేందుకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా భగత్ సింగ్ కాలనీ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. తీవ్ర గాయాలైన పావని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈనెల 25వతేదీ రాత్రి మృతి చెందింది. ఏడుకొండలు ఫిర్యాదుతో నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు26: మండలంలోని మినగల్లు, జొన్నవాడ రీచ్‌లలో ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. వాహనాలు నదిలోకి వెళ్లకుండా పెద్ద గోతులు తవ్వించారు. రెవెన్యూ, పోలీసుల అధ్వర్యంలో బందోబస్తు ఏర్పా టు చేసినట్టు తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే దామరమడుగు, బావనపాడు గ్రామాల పరిధిలోని పెన్నానదిలోకి కూడా వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపడతామని తహసీల్దారు తెలిపారు.

పెంచలస్వామిని దర్శించుకున్న మంత్రి ఆనం

రాపూరు, సెప్టెంబరు 26 : పెంచలకోనలోని లక్ష్మీ నృసింహ స్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ, ఆంజనేయస్వామి వార్లను గురువారం రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ కమి షనర్ ఎస్ సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసు లురెడ్డి, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనం చేయించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహు కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పార్వతమ్మకు పోలంరెడ్డి నివాళి

విడవలూరు, సెప్టెంబరు 26: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతికి కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన తన నివాసంలో పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పార్వతమ్మతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

కాలుష్య నివారణకు కృషి చేయాలి

● అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 26 : కాలుష్యాన్ని నివారించి ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందని ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొణతం భాస్కర్ అన్నారు. గురువారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వేదాయపాళెంలో ని సుస్మిత నర్సింగ్ హోం విద్యార్థులతో కలిసి నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ ర్యాలీని ఆయన ప్రారంభించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ ప్రకృతిని పరిరక్షిస్తే అందరూ ఆరోగ్యకర మైన జీవనాన్ని పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తను కుండీల్లోనే వేయాలని, మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే యూత్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ మహేందర్‌రెడ్డి, పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, గోరంట్ల శేషయ్య పాల్గొన్నారు.

లడ్డూ అపచారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● దోష నివారణకు సంప్రోక్షణ పూజలు



వేంకటేశ్వరస్వామి పూజలో నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 26 : కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ, నైవేద్యాల తయారీకి కల్తీ నెయ్యి వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నెల్లూరు పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం కోరింది. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నగరంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామికి సంప్రోక్షణ పూజలు జరిగాయి. అలిమెల మునిచారి, ఇందుకూరు రమేష్‌కుమార్ ఆచారి, అలిమేలి శ్రీహరి ఆచారి, కందుకూరు జనార్దన్ ఆచారి, దండిపాణి సురేష్, బల్లవోలు రమణయ్య ఆచారి పాల్గొన్నారు.

మంత్రి నారాయణతో అజీజ్ భేటీ



నారాయణను సన్మానిస్తున్న అజీజ్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 26 : రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ గురువారం మంత్రి పొంగూరు నారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అజీజ్‌కు నారాయణ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత జలీల్ కూడా పాల్గొన్నారు. కాగా, అజీజ్ వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితుడైన సందర్భంగా గురువారం ఆయన నివాసంలో కోలాహలం నెలకొంది. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ హైపా, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు తదితరులు అజీజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బాణసంచా దుకాణదారులకు నోటీసులు



దుకాణదారుడికి నోటీసు ఇస్తున్న పోలీసులు

మను బోలు, సెప్టెం బరు 26: మండలకేంద్ర మైన మను బోలు లోని బాణసంచా విక్ర యించే దుకాణదారులకు గురువారం పోలీసులు నోటీసులు జారీచేశారు. దీనిపై ఎస్ఐ రాకేష్ మాట్లాడుతూ టపాసులు విక్రయించేందుకు కేవలం నాలుగు దుకాణదారులకు మాత్రమే లైసెన్సులు ఉన్నాయన్నారు. వాటిని ఈ ఏడాది రెన్యువల్ చేయించుకోవాలన్నారు. అలాగే ఇళ్ళల్లో గాని, గోదాముల్లోగాని ఎక్కువగా బాణా సంచా నిల్వచేయవద్దని హెచ్చరించామన్నారు. ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే దానికి వారే బాధ్యులు అవుతారన్నారు. లైసెన్సులు లేని ఇతర దుకాణాలవారు టపాసులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

డిసెంబర్‌లోగా 260 ఇళ్లు పూర్తిచేయించాలి



అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి

మనుబోలు : డిసెంబర్ నాటికల్లా 26 ఇళ్లు పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో ఇళ్లనిర్మాణంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎల్ స్థాయిలో 94, ఆర్‌సీ స్థాయిలో 166 ఇళ్లు ఉన్నాయని, వాటిని డిసెంబర్‌కల్లా పూర్తిచేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గడువులోగా లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ. రవికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

నెల్లూరు (క్రైం) : వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్లితే... నగరంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన అమీనాబీ గురువారం వెంకటగిరిలోని తన చెల్లెలి వద్దకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చింది. బస్సు ఎక్కే క్రమంలో ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌కి సత్కారం



తాళ్ల నరసింహస్వామిని సత్కరించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు26: స్థానిక కాశీపాళెంకు చెందిన రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామిని పలువురు పద్మశాలీలు, చేనేత కార్మికులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహస్వామి మాట్లాడుతూ ఈ పదవి తనపై బాధ్యతలు పెంచిందన్నారు. టీడీపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వారి అభివృద్ధికి తోడ్పాటతామని తెలిపారు, ఈ కార్యక్రమంలో పోలిశెట్టి నరసయ్య, తలారి తిరుపాలు, వల్లూరు శ్రీనివాసులు, రేబాల బొంతలపాళెం, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై దాడికి ఖండన

కొడవలూరు సెప్టెంబరు 26 : మండలంలోని నాయుడుపాళెంకి చెందిన టీడీపీ నేత సురేంద్రపై వైసీ పీ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అన్నారు. దాడిలో గాయపడి, నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సురేంద్రను పార్టీ నాయకులు అమరేంద్రరెడ్డి, పీ ప్రసాద్‌రెడ్డిలు గురువారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు పాటించని నిర్మాణాలు ఆపేయండి

● సిటీ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశం



భవనం వద్ద కొలతలు వేయిస్తున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 26 : నగర పాలక సంస్థ నుంచి తీసుకున్న నిబంధనలు అతిక్రమించి జరుగుతున్న భవన నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. గురువారం నగరంలోని మాగుంటలేఅవుట్ ప్రాంతంలో సాధారణ తనిఖీల్లో భాగంగా ఓ భవనాన్ని పరిశీలించారు. తీసుకున్న అనుమతుల ప్రకారం ఉందా...?, అతిక్రమించారా...? అని ఆరా తీశారు. అనుమానాస్పదంగా ఉండటంతో కొలతలు వేయించారు. అనంతరం మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న భవనాలన్నిటినీ సిటీప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాలుంటే తక్షణమే కట్టడాల పనులు ఆపేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడుతో కలిసి స్థానిక ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ముత్యాలపాళెంలో తాగునీటి సరఫరాను పరిశీలించిన ఆయన రోడ్లపై తరుచూ చెత్త వేసేవారిని గుర్తిస్తున్నామని, వారికి జరిమానా విధిస్తామని చెప్పారు.

ఈ పాపం నీదేనయ్యా!



'పాప ప్రక్షాళన'కు జగనొస్తున్నాడు.
ఎవరు చేసిన పాపం ఇది?
ఐదేళ్లు తిరుమలలో ఏం జరిగింది?
'మనోళ్ల' నిర్వాకం ఏమిటి?
భక్తి, భయం, పాపభీతి ఎలా మాయమయ్యాయి?
పర్సంటేజీల రాజకీయ అవినీతి టీటీడీలో ఎలా వేళ్లూనుకుంది?
సాధారణ భక్తులకు కిలోమీటర్ల క్యూలు.. వీవీఐపీలకు హారతి దర్శనాలు.. పేదలకు చలికి వణికే షెడ్లు.. పెద్దలకు స్టార్ హోటళ్లను తలదన్నే గెస్ట్‌హౌస్‌లు..
ఎవరు చేసిన పాపం ఇది జగనయ్యా?
బంధు, భక్త అనుచరగణం రెచ్చిపోయి తిరుమలను భ్రష్టు పట్టిస్తూంటే.. చేసిందేమిటి?
మౌనం.. అరాచకానికి ఆమోదం కాలేదా?
ఎలా ప్రక్షాళన అవుతుంది?
ఒక్కరోజు పూజతో చేసినవన్నీ చెరిగిపోతాయా?
గాయపడ్డ భక్త హృదయాలను అబద్ధాలతో మాయచేయగలరా?
ఐదేళ్లు.. మీ పాలనలో తిరుమల కేంద్రంగా జరిగిన తంతును భక్తకోటి తలచుకుని తల్లడిల్లుతోంది. మా విశ్వాసాలను మీ రాజకీయాలకు బలి చేయవద్దని చేతులు జోడించి వేడుకుంటోంది.

అంతా మనోళ్లే!

జగన్‌రెడ్డి పాలనలో మూడుసార్లు టీటీడీ పాలకమండళ్లను ఏర్పాటు చేశారు. జగన్‌రెడ్డికి సమీప బంధువులనే ఛైర్మన్‌లుగా నియమించారు. ఎన్ని విమర్శలు వచ్చినా ఛైర్మన్‌లూ, ఈవోలూ కూడా ఒకే సామాజికవర్గంవారినే నియమించారు. 2019లో ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి, ఈవోగా జవహర్‌రెడ్డి వున్నారు. ఆ బోర్డులోని మొత్తం 37మందిలో ఈవోను మినహాయిస్తే ఛైర్మన్, ఒక ఎక్స్ అఫిషియో మెంబరు, నలుగురు మెంబర్లు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు కలసి ఎనిమిదిమంది రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారే ఉన్నారు. 2021లో రెండవ పాలకమండలి ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి కొనసాగారు. ఈవోగా జవహర్‌రెడ్డి వున్నారు. ఈ బోర్డులోనూ ఏడుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారున్నారు. 2023లో ఏర్పడిన పాలకమండలిలో ఛైర్మన్‌గా భూమన కరుణాకర రెడ్డి, ఈవోగా ధర్మారెడ్డి వున్నారు. ఇందులోనూ ఏడుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. ఐఏఎస్ కాకపోయినా ధర్మారెడ్డి కోసం వైసీపీ ప్రభుత్వం ఏకంగా అదనపు ఈవో పోస్టునే సృష్టించింది. జవహర్‌రెడ్డి బదిలీ తర్వాత రెగ్యులర్ ఈవోను నియమించకుండా ధర్మారెడ్డినే ఇంఛార్జి ఈవోగా కొనసాగించింది. అర్హతలు లేకున్నా సందీప్‌రెడ్డి అనే వ్యక్తికి టీటీడీ ఐటీ విభాగంలో తొలుత సైబర్ ఎక్స్‌పర్ట్‌గా, తర్వాత ఏకంగా ఆ విభాగం జీఎంగా నియమించింది. అదే సామాజిక వర్గానికి చెందిన ఒక పోలీసు అధికారి సీఎంకు సన్నిహితుడనే పేరుతో తిరుమలలో జగన్ జమానాలో చక్రం తిప్పారు.

వివాదాల ఎస్వీబీసీ

టీటీడీ అనుబంధ విభాగమైన ఎస్వీబీసీలో ఇష్టానుసారంగా సలహాదారులను నియమించారు. ధర్మారెడ్డి ఆధిపత్యం ఎస్వీబీసీలోనూ కొనసాగింది. ప్రవచనకారుడు చాగంటి కోటేశ్వరరావు సలహాదారు పదవిని సున్నితంగా తిరస్కరించారు కూడా.

జగన్ సమర్పించిన జంబో బోర్డు

గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో టీటీడీని ఆ పార్టీ నేతలు తమ సొంత సంస్థగా మార్చుకునే ప్రయత్నం చేశారు. టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 29 మందితో ఏర్పాటు కావాల్సిన పాలకమండలిని జంబో బోర్డుగా మార్చివేశారు. 2021 సెప్టెంబరులో 29మందిని సభ్యులుగా మరో 52 మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించి టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చే ప్రయత్నం చేశారు. అయితే హైకోర్టు ఆదేశాలతో ప్రత్యేకాహ్వానితుల నియామకానికి బ్రేక్ పడింది.

అవినీతి మచ్చలున్నవారు పాలకమండలిలో

తీవ్ర అవినీతి ఆరోపణలున్న ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త కేతన్ దేశాయ్‌ని టీటీడీ పాలకమండలి సభ్యుడిగా జగన్ నియమించారు. ఈయనను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ పదవి నుంచే తొలగించారు. ఇటువంటి వ్యక్తిని బోర్డులోకి తీసుకున్నారు. మరొక బోర్డు సభ్యుడు శరత్‌చంద్రారెడ్డి ఢిల్లీ లిక్కర్‌స్కామ్‌లో నిందితుడు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మీద క్రిమినల్ కేసులు వున్నాయి.

దర్జాగా దర్శనాల వ్యాపారం

దేవుడి దర్శనాన్నే వ్యాపారంగా మార్చేశారు. సాధారణ భక్తులను పదుల గంటల పాటు క్యూలైన్లలో పడిగాపులు గాసేలా చేసి, వీవీఐపీల సేవలో తరించారు. బోర్డు సభ్యులు, ఎమ్మెల్యేలు సైతం తిరుమల కొండమీద సొంత పీఆర్వోలను నియమించుకుని దర్శనాల టికెట్లు అమ్ముకున్నారనే ఆరోపణలు ఐదేళ్లూ వెల్లువెత్తినా జగన్ నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండిపోయారు. ఛైర్మన్ కోటాలో రోజుకు పది పన్నెండు మందికి మాత్రమే బ్రేక్ దర్శనాలకు సిఫారసు చేసే సంప్రదాయాన్ని వైసీపీ పాలనలో గాలికి వదిలేశారు. వైవీ సుబ్బారెడ్డి రోజుకు సగటున 364 మందికి వీఐపీ బ్రేక్ టికెట్లను ఇష్టానుసారం ఇచ్చేసేవారు. ఈయన ఛైర్మన్‌గా ఉన్న నాలుగేళ్లలో 3 లక్షలా 60 వేల మందికి ఇట్లా టికెట్లు కేటాయించారంటే టీటీడీని ఎంతగా సొంతానికి వాడేసుకున్నారో అర్థం అవుతుంది. ఆ తర్వాత ఛైర్మన్ అయిన భూమన కరుణాకరరెడ్డి కూడా ఇదే వారసత్వాన్ని కొనసాగించారు. ఉన్నది 9 నెలలే అయినా రోజుకు సగటున 172 మందికి వీఐపీ బ్రేక్ దర్శనాల సిఫారసు లేఖలు ఇచ్చేవారు. ఇక స్వామి దర్శనాలను న్యాయమూర్తులకూ, ఢిల్లీ ప్రముఖులకూ ఎరగా వేసేవారన్న విమర్శలూ జగన్ మీద వచ్చాయి. ధర్మారెడ్డి ఈవోగా ఈ పనిని జగన్ కోసం చేసేవారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జగన్ మీద అనేక కేసులున్న నేపథ్యంలో న్యాయమూర్తులను ప్రసన్నం చేసుకోవడానికి దర్శనాల సమయంలో వారిని స్వామి ముందు కోరుకున్నంతసేపు ఉంచేసేవారనే ఆరోపణలున్నాయి.

శ్రీవాణిలో ఏం జరిగింది?

దర్శనాలలో దళారీలను తొలగించే లక్ష్యంతో ప్రవేశపెట్టి విజయం సాధించామంటూ అధనపు ఈవో ధర్మారెడ్డి పదేపదే ప్రకటించుకున్న శ్రీవాణీట్రస్టు మీద అవినీతి ఆరోపణలు వెల్లువెత్తినా జగన్ పట్టించుకోలేదు. శ్రీవాణీ పేరుతో బ్రేక్ దర్శనాన్ని రూ.10,500గా చేసి రోజుకు వెయ్యి టికెట్లు అమ్మేశారు. ఆ సొమ్ముల లెక్కలు తేల్చనే లేదు. ఆలయాల రిపేర్లకు, నిర్మాణాలకు వాడుతున్నామని చెప్పారు.శ్రీవాణిలో భారీ కుంభకోణం జరిగిందని భక్తులు భగ్గుమనడంతో విచిత్రంగా తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఒక నిజనిర్ధారణ కమిటీ వేసి, అంతా శభాష్ అని ఒక సర్టిఫికెట్ ఇప్పించుకున్నారు.

అద్దెలు మూడు రెట్లు...

తిరుమల కొండమీద వసతి అంటే భక్తులకు ఒకప్పుడు చవగ్గా లభించేది. తక్కువ ఖర్చుతో కుటుంబం అంతా ఒకటి రెండు రోజులు ఈ చల్లని ప్రదేశంలో దేవదేవుని సన్నిధిలో గడిపి వెళ్లేవారు. జగన్ పాలనలో పర్యాటక కేంద్రాలతో పోటీపడేలా ఈ ఆధ్యాత్మిక కేంద్రంలో రేట్లు పెంచేశారు. పాలకమండలి సమావేశంలోనే (17 ఫిబ్రవరి 2022) ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వేలం పాట తరహాలో గదుల అద్దె రేట్లు రెండు మూడు రెట్లు పెంచేలా నిర్ణయం తీసుకున్న వీడియో వైరల్ అయ్యి అందరూ ఇదేమి తీరు అని విస్తుపోయినా జగన్ చలించలేదు. గదుల నిర్వహణ కూడా దారుణంగా తయారైంది. పరిశుభ్రతను పట్టించుకోలేదు.

లడ్డూనే కల్తీ చేసేశారు కదయ్యా!

తిరుమల లడ్డూ అనగానే ఘుమ ఘుమ లాడేది. ఈ రుచి ఇంకెక్కడా ఎవరు చేసినా సాధ్యం అయ్యేది కాదు. ప్రపంచ పేటెంట్ కూడా తిరుమల లడ్డూకి లభించింది. ఇంతటి ప్రత్యేకత ఉన్న లడ్డూనే జగన్ జమానాలో భ్రష్టు పట్టించేశారు. ఇతర ముడి పదార్థాల సరఫరాకు, కోరుకున్నవారికి వందల కోట్ల టెండర్లు కట్టబెట్టేశారు. తమవాళ్లకే టెండర్లు దక్కేలా చేయడం కోసం ఏకంగా టెండరు నిబంధనలనే మార్చేశారు. రివర్స్ టెండర్ల పేరుతో కనీస నాణ్యత లేని సరుకులతో నింపేశారు. కల్తీ నెయ్యితో లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతనే దెబ్బ తీసేశారు. జగన్ పాలనలో పొందిన టెండరుతో సరఫరా చేసిన నెయ్యిలో పందికొవ్వు, ఆవుకొవ్వు వంటివి ఉన్నాయని తేలడం.. టీటీడీ చరిత్రలోనే ఎన్నటికీ చెరగని మచ్చగా మిగిలిపోయింది.ఆర్గానిక్ ముడి పదార్థాల పేరుతో ఇతర అన్న ప్రసాదాలను కూడా రుచిలేకుండా చేసేశారు.

టీటీడీలోనూ పనులకు పర్సెంటేజీలు

టీటీడీ నిర్మాణ పనులంటే ఒకప్పుడు నాణ్యతకు తిరుగులేదనే పేరుండేది. అందుకు కారణం అవినీతికి అవకాశం పరిమితం కావడమే. కొద్దిమంది అధికారులో, ఉద్యోగులో ఆశపడ్డా కానుకల స్థాయికి మించేది కాదు. జగన్ పాలనలో రాష్ట్రప్రభుత్వం పనుల తరహాలోనే పర్సెంటేజీల విధానం మొదలైంది. నాయకులకు వాటాలు తప్పలేదు. అవసరంతో సంబంధం లేకుండా నిర్మాణ పనులు విపరీతంగా పెంచేశారు. వందల కోట్లు కేటాయించేశారు. దీంతో టీటీడీలోనూ అవినీతి వ్యవస్థగా మారిపోయింది. ముఖ్యంగా ఎన్నికలకు ఏడాది ముందు నుంచీ ఈ పరిస్థితి విపరీతమైందనే ఆరోపణలున్నాయి. తిరుపతిని కేంద్రం చేసుకుని అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా నిధులు విడుదల చేశారు. రోడ్లు, భవనాలకు నాయకులు అడగడం, అధికారులు కేటాయించేయడం జరిగింది. తిరుపతి నాయకుల పర్సెంటేజీల కోసమే రూ. వందల కోట్లు పనులు ఆగమేఘాల మీద మొదలు పెట్టారనే విమర్శలు వచ్చాయి. బాగున్న సత్రాలు కూల్చేసి కొత్తవి నిర్మించడానికి రూ.600 కోట్లు కేటాయించేశారంటే అవినీతి విశ్వరూపం అర్థం అవుతుంది. స్విమ్స్‌లో దివ్యంగా ఉన్న భవనాలను రిపేరు చేయాలంటూ రూ.200 కోట్లు ధారాళంగా కేటాయించేశారు. తిరుపతి నాయకుల ఎన్నికల ఖర్చుల కోసమే ఆగమేఘాల మీద కాంట్రాక్టులు ఇచ్చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తినా జగన్ ప్రభుత్వం.. 'ఏం జరిగింది' అనే ఆరా కూడా తీయలేదు. అర్హత లేని అధికారిని ఇంఛార్జి సీఈగా నియమించారు.నిబంధనలకు విరుద్ధంగా సీనియర్లు వున్నప్పటికీ రెగ్యులర్ సీఈగా అతన్నే కొనసాగించారు. బాధిత అధికారికి న్యాయం చేయాలన్న హైకోర్టు ఆదేశాలు కూడా అమలు కాలేదు.

జిల్లా పాలనలోనూ అదే ముద్ర

జిల్లా తొలి కలెక్టర్‌గా వెంకట్రమణారెడ్డి, తిరుపతి అర్బన్ ఎస్పీగా ఆవుల రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్పీగా పరమేశ్వర రెడ్డి, తిరుపతి ఆర్డీవోలుగా కనకనరసారెడ్డి, నిశాంత్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి, ఎస్వీయూ వీసీలుగా రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బర్డ్ స్పెషలాఫీసర్‌గా రెడ్డెప్పరెడ్డి, స్విమ్స్ స్పెషలాఫీసర్‌గా జగదీశ్వర్‌రెడ్డి... ఇలా కీలక స్థానాల్లో ఒకే సామాజికవర్గానికి చెందిన వారే గత ఐదేళ్ళలో పనిచేశారు. కనకనరసారెడ్డి బదిలీ అయినా జిల్లా దాటకుండా రుయాలో ఏవోగా నియమితులయ్యారు. జిల్లాలో పలు శాఖల అధికారులుగా, పోలీసు శాఖలో కీలక స్థానాల్లోనూ అదే వర్గానికి చెందిన వారు పనిచేశారు.

జిల్లాలోనూ పవర్ అంతా వాళ్లదే!

జగన్ పాలనలో జిల్లా అంతా ఒకే సామాజికవర్గం మయం అయిపోయింది. పదవులన్నీ వారికే. అధికారులూ వారే. జిల్లాలో ఎనిమిది సెగ్మెంట్లుంటే మూడు ఎస్సీ రిజర్వుడు మినహా మిగతా ఐదు స్థానాల్లో ఒకే సామాజికవర్గం వారు వైసీపీ తరఫున ఎమ్మెల్యేలుగా ఉన్నారు. తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర రెడ్డి మూడున్నరేళ్ళు, ఆపై ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి తదుపరి ఏడాదన్నర కొనసాగారు. వీరిద్దరూ టీటీడీ ట్రస్టు బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యులుగా కూడా కొనసాగారు. తిరుపతి కార్పొరేషన్‌లో రెండు మేయర్ పదవుల్లో ఒకటి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి కుమారుడు అభినయ్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యే, తుడా ఛైర్మన్ పదవులకు అదనంగా చెవిరెడ్డి అసెంబ్లీ విప్ పదవి కూడా పొందారు.

తిరుపతిలో టెన్షన్

తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ కొండకు రావద్దంటూ హిందూ సంఘాల నిరసన. క్రిస్టియన్ జగన్ గో బ్యాక్. అంటూ నినాదాలు. డిక్లరేషన్ ఇవ్వాలంటూ బీజేపీ నేతల డిమాండు. తిరుమలకు రావాలంటే అడ్డుకుంటామని హెచ్చరికలు. శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణల నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకునేందుకు మాజీ సీఎం జగన్ శుక్రవారం తిరుమల రానున్న క్రమంలో గురువారం తిరుపతిలో తలెత్తిన పరిణామాలివి. ఈ క్రమంలో తిరుపతిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. మరోవైపు వైసీపీ నేతలూ భారీ ఎత్తున జనసమీకరణ చేసినట్లు తెలిసింది. పోలీసులు అడ్డుకోని పక్షంలో జగన్‌నేరుగా తిరుమల వెళతారని, ఎక్కడైనా అడ్డుకుంటే అక్కడే శ్రేణులతో కలసి బైఠాయించాలని నిర్ణయించినట్టు తెలిసింది. తిరుమలకు అనుమతించే వరకూ వెనుదిరగకుండా ఆందోళన చేపట్టడం ద్వారా వివాదం పెద్దది చేసి అందరి దృష్టినీ ఆకర్షించే ప్రయత్నం చేయనున్నట్టు తెలిసింది. వైసీపీ నేతల వ్యూహానికి ప్రతివ్యూహంగా పోలీసులు విమానాశ్రయం వద్దే జగన్‌ను అడ్డుకునే అవకాశముందని సమాచారం. విమానాశ్రయంలోనే ఆయనకు నోటీసులు ఇచ్చి, శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం వెనుదిరిగి పోవాల్సిందిగా కోరనున్నట్టు సమాచారం. అలా కాకుండా వెలుపలికి రావాలని యత్నిస్తే అడ్డుకునే అవకాశముంది. దీనికోసం విమానాశ్రయం వద్ద ఇప్పటికే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జగన్ షెడ్యూల్ ఇలా: శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విమానాశ్రయానికి రాక. రోడ్డు మార్గాన 7 గంటలకు తిరుమల చేరిక. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో బస. శనివారం ఉదయం 10.30 గంటలకు శ్రీవారి దర్శనం. మధ్యాహ్నం తిరుగు ప్రయాణం.

జిల్లాలో 30 పోలీసు యాక్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 26: జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి 30 పోలీసు యాక్టు అమల్లోకి వచ్చింది. అక్టోబరు 24వ తేది వరకు ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ పార్టీల నాయకులు, సంస్థలు, వివిధ సమూహాలు, ప్రజలు ఈ ఉత్తర్వులను పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



● వెంకటగిరికి పోటెత్తిన భక్తజనం ● చల్లంగ చూడమ్మ తల్లి అంటూ మొక్కులు ● వేడుకగా అమ్మవారి విరూపోత్సవం

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

● వెంకటగిరిలో ఎటుచూసినా జనసందోహమే ● పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొన్న భక్తులు





వేయికళ్ల దుత్తలతో అమ్మవారి దర్శనానికి.. - పొలి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు

వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 26: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. క్యూలో నిలబడి దర్శించుకున్నారు. జాతరలో భాగంగా గురువారం తెల్లవారుజామున అమ్మవారు భక్తుల దర్శనార్థం దేవస్థానం వద్ద వేపమండలతో పందిరి వేసి కొలువు తీర్చారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి వేయికళ్ల దుత్తల్లో దీపాలు వెలిగించి నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై నడుస్తూ కొందరు.. నవధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించుకొని ఇంకొందరు మొక్కులు చెల్లించుకున్నారు. నగరి ఆభరణాలైన బంగారు శూలం, సరుడును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకుపోయి ఉంచారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును తెగనరికి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి..పొలి అని అరుస్తూ చల్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను ఉంచి విరూపమహోత్సవం నిర్వహించారు. శివాలయం వద్దకు చేరుకోగా అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనంతరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపంలో అమ్మవారి ప్రతిమను విరూపం గావించారు. అప్పటి వరకు గండర దీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి మట్టిని ఇంట ఉంచుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని, తింటే రోగాలు దూరమవుతాయన్నది స్థానికుల నమ్మకం. దీంతో అమ్మవారి మట్టిని దక్కించు కునేందుకు భక్తులు పోటీపడటంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమ్మవారికి రాజాలు సమర్పించిన ఆభణాలతోపాటు, స్వర్ణ కిరీటం అలంకరించారు. ఈ ఏడాది జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టి సారించారు.

తప్పెవరిది?

ఘటోత్సవంలో పొలికుండలు, బలిదున్న పోతును వాహనంపై ఊరేగించడం.. రాజాల వంటశాలకు బలి దున్న పోతును తీసుకెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి జాతర ఊరేగింపులో, గురువారం అమ్మవారి విరూపోత్సవంలో సంప్రదాయం ప్రకారం రాజాల నగిరి నుంచి పంపే సప్పరం వినియోగించాలి. ఈ ఆచారానికి గత పాలకులు చరమ గీతం పాడి.. రథానికి బదులు ట్రాక్టరును వినియోగించారు. దీనిని అప్పట్లో తప్పు పట్టిన ఎమ్మెల్యే కురుగొండ్ల అదే ఆనవాయితీని కొనసాగించడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. సప్పరంపై అమ్మవారిని ఊరేగిస్తే రోడ్డుకు రెండువైపులా ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కలిగే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. ఇలా.. జాతర ఆచార వ్యవహారాల్లో తప్పిదం పాలకులదా? పాలకవర్గానిదా? లేదా అధికారులదా? అన్న చర్చ సాగుతోంది.



అమ్మవారి మట్టి కోసం తోపులాట

పోలీసుల వైఫల్యం

జాతర నిర్వహణలో పోలీసుల వైఫల్యం కనిపించింది. భారీ బందోబస్తు ఏర్పాటుచేసినా వారిని సమన్వయ పరుచుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ ఏడాది కూడా పోలీస్, అధికారుల బంధువులకు వీవీఐపీ దర్శనాలు పెచ్చుమీరడం వల్ల సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ దశలో ఎమ్మెల్యే కురుగొండ్ల జోక్యం చేసుకొని వీఐపీ దర్శనాలను కొంతసేపు నిలిపి వేయించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేక మండటెండలో గంటల తరబడి వాహనాలు ఆగిపోవడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడ్డారు. పోలీస్, అధికారుల సిఫారసు ఉన్న వారి వాహనాలను మాత్రం రాజమార్గంలో గుడి దగ్గర వరకు వెళ్లనివ్వడంతో కొన్నిచోట్ల ప్రజలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

జాతర ఏర్పాట్లు ఫెయిల్: మంత్రి ఆనం

పోలీసుల నిర్లక్ష్యంతో పోలేరమ్మ జాతర ఫెయిల్ అయిందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. పోలేరమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున గురువారం ఆయన పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్న తాను పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని పోరాడామన్నారు. గతేడాది ప్రభుత్వం గుర్తింపునిచ్చినా నిధులను విడుదల చేయలేదని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అమ్మవారి జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపునిస్తూ రూ.50 లక్షలు అందించిందన్నారు. ఈ జీవోను కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు అందించారు. అనంతరం కురుగొండ్ల రామకృష్ణ వీరిని సన్మానించగా వేదపండితులు ఆశీర్వచనం పొందారు.





పోలేరమ్మకు రాజాల సారె తీసుకుని వస్తున్న రాజా కుటుంబీకులు సర్వజ్ఞయాచేంద్ర



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రులు కందుల సురేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



పోలేరమ్మకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల దంపతులు



అమ్మవారి దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



కర్ణాటక హైకోర్టు జడ్జి సుమలతకు వేద పండితుల ఆశీర్వచనం



అమ్మవారికి సారె తెస్తున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి

చెరువుమట్టి తరలింపునకు యత్నం

- అడ్డుకున్న గ్రామస్థులు - రెండు గంటలపాటు ఉద్రిక్తత



జేసీబీని అడ్డుకుంటున్న గ్రామస్థులు

కోట, సెప్టెంబరు 26: కోట మండలం ఉత్తమనెల్లూరు చెరువులో అక్రమంగా తరలిస్తున్న మట్టిని, వాహనాలను గురువారం గ్రామస్థులు అడ్డుకొని నిరసన, ఆందోళన చేశారు. వాహనాలను చెరువులోకి దిగనీయకుండా గ్రామస్థులు వాహనాలకు అడ్డంగా బైఠాయించారు. స్థానికుల కథనం మేరకు.. ఉత్తమనెల్లూరు చెరువులోని మట్టిని ప్రైవేట్ పనులకు స్థానికంగా ఉన్న కొంతమంది నాయకులతో కలసి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు అక్రమంగా జేసీబీలతో తవ్వించి టిప్పర్ల ద్వారా తరలించుకునేందుకు చెరువు వద్దకు వచ్చారు. ముందుగానే పసిగట్టిన గ్రామస్థులు భారీగా చెరువు వద్దకు చేరుకొని, చెరువులోకి వాహనాలు దిగకుండా అడ్డంగా నిలబడ్డారు. మట్టిని తరలిస్తే ఒప్పుకునేదిలేదంటూ నినాదాలు చేశారు. వాహనదారులు కాంట్రాక్టర్ల సలహాలతో చెరువులోకి బలవంతంగా దిగి తవ్వే ప్రయత్నాలు చేయగా, గ్రామస్థులంతా జేసీబీని చుట్టుముట్టడంతో రెండు గంటలపాటు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉత్తమ నెల్లూరు గ్రామస్థులు చెరువు మట్టి తవ్వకాలకు ఒప్పుకోకపోవడంతో వాహనాలు, కాంట్రాక్టర్ వెనుతిరిగి వెళ్లిపోయారు.

సీఎంకు చెక్కు అందజేత



చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న రాజగోపాల్

గూడూరు, సెప్టెంబరు 26: మంగళగిరిలో గురువారం గూడూరుకు చెందిన విశ్రాంత ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాటకం రాజగోపాల్ రూ.2లక్షలు చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ.. అన్నక్యాంటీన్ నిర్వహణకు లక్ష రూపాయలు, రాజధాని అమరావతి అభివృద్ధికి లక్ష రూపాయలును చెక్కు ద్వారా సీఎంకు అందజేశానన్నారు.

గ్యాస్ పైపులైన్ కోసం అడ్డగోలుగా గుంతల తవ్వకాలు


● అడ్డుకున్న స్థానికులు



గుంతల తవ్వకాన్ని అడ్డుకున్న స్థానికులు

నాయుడుపేట, సెప్టెంబరు 26: స్థానిక రామకృష్ణాపురంలో ఇటీవల వేసిన సిమెంట్‌రోడ్డుకు ఇరువైపులా భారీ గుంతలను తీస్తుండటంతో గురువారం స్థానికులు అడ్డుకున్నారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో ఎక్కడ పడితే అక్కడ సిమెంట్ రోడ్లను ధ్వంసం చేసిగ్యాస్‌పైపులైన్‌లు వేస్తున్నారు. గతంలో మున్సిపల్ కమిషనర్ ఒక ప్రాంతంలో పైపులైన్‌లకు తీసిన గుంతలను పూర్తిగా మరమ్మతులుచేసి మరో ప్రాంతానికి వెళ్లాల్సిందిగా ఆదేశించినప్పటికీ గ్యాస్ పైపులైన్ నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా సిమెంట్ రోడ్లను పగలగొట్టి పైపులైన్‌లు వేస్తుండటంతో సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

గుర్తు తెలియని యువకుడి మృతి



దొరవారిసత్రం, సెప్టెంబరు 26: దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన గల పొలాల్లో గురువారం గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సుమారు 25 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు పొలంలో బోర్లాపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికుల సమాచారంతో తెలుసుకొన్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. యువకుడు గత నాలుగు రోజులుగా నెలబల్లిలో సంచరిస్తూ మూర్ఛ వ్యాధితో బాధపడుతూ తిరిగే వాడని స్థానికులు తెలిపారు. బుధవారం రాత్రి ఆ వ్యాధి వలన చనిపోయి ఉండవచ్చుని పోలీసులు భావించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుడి వివరాల కోసం పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెళ్లకూరు, సెప్టెంబరు 26: మండలంలోని చిల్లకూరు 71వ జాతీయ రహదారిపై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్న లారీ చిల్లకూరు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి రోడ్డు పక్కన ఆపిఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా వెంకటాపురానికి చెందిన లారీ క్లీనర్ కార్తీక్ (23) మృతి చెందాడు. డ్రైవర్ వినోద్‌బాబు, బీహార్‌కు చెందిన మరో లారీ క్లీనర్ కుమార్ సింగ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగ తెగిపడి ఒకరి మృతి

బాలాయపల్లి, సెప్టెంబరు 26: విద్యుత్ తీగ తెగిపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మేల్లూరు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఓజిలి మండలం షన్నేపల్లి గ్రామానికి చెందిన కురుగొండ్ల వెంకటాద్రి నాయుడు(50) తన చిన్నకుమారుడు హరీష్‌తో కలసి మోటరుసైకిల్‌పై వెంకటగిరి పోలేరమ్మ జాతరకు వెళుతుండగా నాయుడుపేట-వెంకటగిరి మార్గంలోని మేల్లూరు సమీపంలోని పల్లెమిట్ట వద్ద విద్యుత్ తీగ తెగి వెంకటాద్రినాయుడుపై పడడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. కుమారుడి కళ్లెదుటే తండ్రి విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించాడు. పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

మహిళ మృతి

చిల్లకూరు, సెప్టెంబరు 26: మండలంలోని ఓడూరు-పెద్దపరియ రైల్వేమార్గంలో గురువారం రైలు పట్టాల సమీపంలో ఓ మహిళ మృతిచెంది ఉండటాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి గూడూరు జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్ పోలీసుల వివరాల మేరకు... ఓడూరు రైల్వేస్టేషన్ సమీపంలో 45 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని మహిళ రైలుపట్టాలపై మృతిచెంది ఉందన్నారు. కుడిచేతిపై ధను అని పచ్చబొట్టు, పసుపురంగు పంజాబీ డ్రస్ ధరించి ఉందన్నారు. గుర్తుతెలియని రైలులో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉండవచ్చని జీఆర్ పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోట, సెప్టెంబరు 26: మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంకు చెందిన శివయ్య (35) అనే వ్యక్తి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 20వ తేదీన కుటుంబ కలహాల నేపథ్యంలో శివయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

గూడూరు అర్బన్, సెప్టెంబరు 26: స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద గురువారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు వెలుగు సిబ్బంది సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. కోట మండలానికి చెందిన వీవోఏలు సుజాతమ్మ, మునెమ్మ, వరలక్ష్మీ, లావణ్య, సీసీ శ్రీకాంత్ రూ.50వేలు చెక్కును విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధి కోసం ఎమ్మెల్యేకు అందజేశారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత చంద్రబాబుదే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 26: వైసీపీ ఐదేళ్లపాలనలో గాడితప్పిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం సారథ్యంలో సీఎం చంద్రబాబు అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక సాధుపేట సెంటర్‌లో ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం అధికారం చేపట్టిన వందరోజులలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, మట్టం శ్రావణి, వాటంబేడు శివకుమార్, సిద్ధయ్యనాయుడు, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి, మోహన్, అల్లీహుస్సేన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి సమపాళ్లలో అందిస్తున్న మంచి ప్రభుత్వం



నాయుడుపేటలో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల తదితరులు

నాయుడుపేట, సెప్టెంబరు 26: ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందిస్తున్న ఎన్డీయేదే మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట ఎంఆర్‌నగర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అధ్యక్షతన నిర్వహించిన మంచి ప్రభుత్వ కార్యక్రమంలో టీడీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక అల్లెమ్మగుడిలో 101 కొబ్బరికాయలను కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలింతలకు సీమంతాలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కొండల్‌రావు, కమిషనర్ ఫజులుల్లా, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు పార్థసారధి, నెలవల రాజేష్, అరవపెరిమిడి చంద్రారెడ్డి, మైలారి రాజశేఖర్, దార్ల రాజేంద్ర, పసల గంగాప్రసాద్, కుబేరు మణి, నానాబాల సుబ్బారావు ఉన్నారు.

సూళ్లూరుపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు కరపత్రాలు అందజేసి, వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాలింతలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, మాజీ ఎంపీపీ పి.సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు పి.మునస్వామి, రాజసులోచనమ్మ, రవి, రాము, పార్థసారథి, బీజేపీ నాయకులు ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డిజైన్స్ ఎస్‌ఈగా శారద

● పలువురు ఈఈల బదిలీలు

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్‌ఈగా ఓరింపాటి శారద నియమితులయ్యారు. ఇప్పటి వరకూ కడప జిల్లా ఇరిగేషన్ శాఖలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్‌ఈగా ఉన్న ఆమె గురువారం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా తిరుపతికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి తెలుగు గంగ ప్రాజెక్టు గాలేరు-నగరి విభాగం ఒకటవ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం మంజుల కడప జిల్లా ఎస్‌కేడీ జీఎన్‌ఎస్‌ఎస్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టు 2వ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా వ్యవహరిస్తున్న ఇరగా శ్రీనివాసరావు అక్కడ నుంచీ గూడూరు ఎస్‌ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. అనంతపురం తుంగభద్ర ప్రాజెక్టు కార్యాలయం నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రజావత్ సునీల్ నాయక్ తిరుపతి తెలుగు గంగ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరాజు రేణిగుంట జీఎన్‌ఎస్‌ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.

ఇద్దరు ఆర్డీవోల బదిలీ

కలెక్టరేట్, సెప్టెంబర్ 26: జిల్లాలో ఇద్దరు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని జీఏడీకి రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. అక్కడ డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న భానుప్రకాష్ రెడ్డిని శ్రీకాళహస్తి ఆర్డీవోగా నియమించింది. ఇక సూళ్లూరుపేట ఆర్డీవోగా పనిచేస్తున్న చంద్రమునిని జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. ఎన్టీఆర్ జిల్లా కోనేరు రంగారావు కమిటీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈతమాకుల కిరణ్మయిని సూళ్లూరుపేట ఆర్డీవోగా నియమించింది. జిల్లాలో అత్యంత కీలకమైన తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి ఇటీవల అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. శుక్రవారం మరికొంత మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ కానున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల (ఆర్డీవోలు) బదిలీల్లో కూటమి ప్రభుత్వం శిక్షణ పూర్తి చేసుకున్న డిప్యూటీ కలెక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

మున్సిపల్ కమిషనర్‌గా ఫజులుల్లా బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 26: నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా ఫజులుల్లా గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న ఫజులుల్లా బదిలీపై నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. ఆయనను మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్, ఏఈ జాకీర్, సిబ్బంది లక్ష్మీ, శ్రావణి, రమేష్, చిరంజీవి, శ్రీనివాసులు, గాయత్రి తదితరులు స్వాగతించారు.

మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయ్

వాకాడు, సెప్టెంబరు 26: జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాకాడు మండలానికి చెందిన దామా విజయ్‌కుమార్‌ను గురువారం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎంఎల్ రాజు నియమించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ జాతి ఐక్యత కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

4 కేజీల గంజాయి పట్టివేత

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 26: అక్రమంగా తరలిస్తున్న 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో బుధవారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వెంకటరావు అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకొని విచారించగా, అతడి వద్ద 4 కేజీల గంజాయి దొరికిందని చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేపు యువజనోత్సవాలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 26: వివేకానంద జయంతి సందర్భంగా శనివారం యువజనోత్సవాలు నిర్వహించనున్నామని సెట్విన్ సీఈవో మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీకాలనీలోని ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో ఉదయం 9.30గంటల నుంచి సాంస్కృతిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మొదటి స్థాయిలో గెలుపొందిన కళాకారులకు రాష్ట్రస్థాయి, అక్కడ గెలుపొందితే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని తెలిపారు. జానపద నృత్యాలు, గీతాలు, కవిత్వం, వ్యాసరచన, పెయింటింగ్ వంటి పోటీలు ఉంటాయని, మరిన్ని వివరాలకు 0877 - 2286921, 7036428762లలో సంప్రదించాలని కోరారు.